J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 11.12.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerpatrika.com



## తిరుపతిపై..
# కన్నేసిన కమలం

### ముందే అభ్యర్థిని ప్రకటించేసిన టిడిపి

స్థానిక సంస్థల ఎన్నికల పంచాయతీ ఇంకా కోర్టు చుట్టూ తిరుగుతూనే వున్న తరుణంలో తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక దగ్గరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిట్టింగ్ పార్లమెంటు సభ్యుడు బల్లిదుర్గాప్రసాద్ ఆకస్మిక మరణంతో తిరుపతి సీటు ఖాళీ అయిన విషయం తెలిసిందే. అన్ని పార్టీలకంటే ముందుగా తెలుగుదేశం తమపార్టీ అభ్యర్థిని ప్రకటించేసింది. 2019లోనే వైసిపి తీర్థం పుచ్చుకోవాలని ఉబలాట పడ్డ పనబాక కృష్ణయ్య కోరిక అప్పట్లో లక్ష్మి అంగీకరించకపోవడంతో నెరవేరలేదు. ఆ తరువాత జరిగిన అనేక రాజకీయ సమీకరణలతో పనబాక లక్ష్మి తెలుగుదేశం అభ్యర్థిగా తిరుపతి నుండి పోటీ చేసి ఓడిపోయింది. ఈసారి మళ్ళీ పనబాక దంపతులు



తిరుపతిలో మకాం వేసిన భాజపా జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్

### అభ్యర్థిని నిర్ణయించినా ప్రకటించని వైసిపి

ఎక్కడ మనసు మార్చుకుని వైసిపికి జంప్ అయిపోతారో అని భయపడ్డ చంద్రబాబు అందరికంటే ముందుగా పనబాక లక్ష్మిని తమ పార్టీ అభ్యర్థిగా ముందుగానే ప్రకటించేశాడు. పనబాక దంపతులు కూడా ఈసారి ఆచితూచి అడుగేయాలని అనుకున్నారో ఏమో కాని కుమార్తె నిశ్చితార్థాన్ని కారణంగా చూపి కొంతకాలం మౌనంగా వుండి, ఇప్పుడు బరిలో దిగారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడిని కలిసి వ్యూహాన్ని చర్చించుకొని నియోజకవర్గంలో మళ్ళీ కాలు మోపారు.

వైసిపి కూడా తమ అభ్యర్థిని నిర్ణయించింది కానీ ప్రకటించలేదు. బల్లి కుమారుడే అభ్యర్థి అవుతాడని ఊహించిన

### అభ్యర్థి తేలకుండానే ప్రచారంలో బిజెపి

(మిగతా 10వ పేజీలో)

## సాగు చట్టాలకు వ్యతిరేకంగా...
# ఆగ్రహించిన 'అన్నదాత'

- 'భారత్ బంద్' విజయవంతం
- దేశ వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు.. పెల్లుబికిన ఆందోళనలు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఈనెల 8న నిర్వహించిన భారత్ బంద్ విజయవంతమైంది. అన్నదాతల నిరసనల గళం దేశవ్యాప్తంగా మార్మోగింది. వామపక్షాలు, కాంగ్రెస్‌పార్టీ, రైతు సంఘాలు, వాటి అనుబంధ సంఘాలు దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా నిలిచాయి. రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం కలిగించని ఆ మూడు చట్టాలను రద్దు చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

కేంద్రం ఇటీవల తెచ్చిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ఆందోళనలు పెల్లుబుకాయి. దేశంలో కొన్ని చోట్ల విజయవంతంగాను, మరికొన్ని రాష్ట్రాల్లో పాక్షికంగానూ బంద్ జరిగింది. ఢిల్లీ శివారు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో బంద్ జరిగింది. (మిగతా 10వ పేజీలో)







## భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా

# కొత్త పార్లమెంటు భవనం

- డిసెంబర్ 10న గురువారం ప్రధాని చేతులమీదుగా జరిగిన శంకుస్థాపన
- 2022కి ప్రారంభించడమే లక్ష్యం



నూతన పార్లమెంటు భవనానికి గురువారం మధ్యాహ్నం 1.00గంటలకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశాడు. 2022లో ఈ భవనం ప్రారంభించబడేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలన్నీ ప్రతిబింబించేలా ఈ భవన సముదాయానికి రూపకల్పన చేశారు.

64,500చ.మీ విస్తీర్ణంలో 971కోట్ల ఖర్చుతో నిర్మితమవుతున్న ఈ కొత్త భవన సముదాయం పురి విప్పి ఆడుతున్న నెమలి(జాతీయ పక్షి) ప్రతిరూపంగా ఉంటుంది. లోక్‌సభ పైకప్పు విరబూసిన కమలం(జాతీయ పుష్పం) స్వరూపంతో దర్శనమిస్తే, రాజ్యసభ పైకప్పు పార్లమెంట్ అంతర్భాగంలో జాతీయ వృక్షం మర్రిచెట్టు అలంకారంగా కనిపిస్తుంది. అణువణువునా భారతీయత ఉట్టిపడేలా నిర్మితమవుతున్న ఈ నూతన పార్లమెంటు సముదాయ అలంకరణ కోసం 200మందికిపైగా హస్తకళాకారులు శ్రమించనున్నారు.

ప్రధానమంత్రి చేతులమీదుగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిస్వభూషణ్ హరిచందన్ విజయవాడ నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు.

## బడుగుల బ్రతుకుల్లో కాంతి...

# జగనన్న 'జీవ క్రాంతి'

- రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకలు పంపకం




రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మలకు మెరుగైన జీవనోపాధి ద్వారా సుస్థిర ఆదాయం లక్ష్యంగా... జగన్మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ మరో అడుగు ముందుకు వేశాడు. డిసెంబర్ 10వ తేదీ గురువారం ఉదయం 'జగనన్న జీవక్రాంతి' పథకం ద్వారా రూ.1869 కోట్ల వ్యయంతో 2,49,151 గొర్రెలు, మేకల యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లాలోని చేజర్ల గ్రామంలో లబ్దిదారులకు గొర్రెలు, మేకలను అందజేశారు.

45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయస్సు గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం వై.ఎస్.ఆర్.చేయూత, జగనన్న జీవన క్రాంతి పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ వై.ఎస్.ఆర్. చేయూత, జగనన్న జీవన క్రాంతి పథకాల ద్వారా సుమారు 45,000మంది లబ్దిదారులకు గొర్రెలు, మేకలు, పాడి పశువులు అందించడానికి ప్రణాళికలు రూపొందించామని, దానిలో భాగంగా 567 యూనిట్స్ అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమూల్ డెయిరీ ద్వారా పాల సేకరణకు ఒప్పందం కుదుర్చుకుందని, గురువారం అల్లానా సంస్థతో 'జగనన్న జీవన క్రాంతి' పథకం లబ్దిదారులు పెంచిన గొర్రెలు, మేకల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, వైయస్సార్‌సీపీ శ్రేణులు ప్రభుత్వ అధికారులు మరియు లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఏసిబి డైరెక్టర్‌గా

# మన మల్లారెడ్డి



తెలంగాణా క్యాడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి బుసిరెడ్డి మల్లారెడ్డి ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. రెండు సంవత్సరాలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నాడు. మల్లారెడ్డిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 4వతేది ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రెండు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ ఇచ్చింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నాడు.

2020 జూన్ 30వ తేదీన ఆయన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఐ.జి మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశాడు. మల్లారెడ్డి స్వస్థలం తెలంగాణలోని నల్గొండ అయినప్పటికీ ఆయన నెల్లూరీయులకు అభిమాన పాత్రుడు. అందుకే ఆయనను మన మల్లారెడ్డి అని నెల్లూరీయులు ఆప్యాయంగా పిలుచుకుంటారు. ముఖ్యంగా దివంగత ప్రజానేత ఉమ్మడి రాష్ట్ర మాజీముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డికి మల్లారెడ్డి వీరాభిమాని. ఇప్పటికీ వైయస్ కుటుంబంతో మల్లారెడ్డికి ఆత్మీయ సంబంధాలున్నాయి.

2007 అక్టోబర్ నుండి 2010 ఫిబ్రవరి వరకూ రెండున్నర సంవత్సరాలపాటు నెల్లూరుజిల్లా ఎస్పీగా మల్లారెడ్డి పనిచేశాడు. ఆయన నెల్లూరు ఎస్పిగా వున్న సమయంలోనే 2009 సెప్టెంబర్ 2న రాజశేఖర రెడ్డి ప్రమాదానికి గురై తెలుగు ప్రజలకు దూరమయ్యారు. రాజశేఖరరెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి మల్లారెడ్డి రాక కోసం ఆయన ఆత్మీయులు ఎదురు చూశారు. ఆయన తెలంగాణలో పదవీ విరమణ చేసిన 5 నెలలకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు సముచిత పదవితో ఆయనను గౌరవించింది.

డిసెంబర్ 10వ తేదీ గురువారం మధ్యాహ్నం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసిన మల్లారెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. భాద్యతాయుతంగా విధులు నిర్వహించవలసిందిగా సియం మల్లారెడ్డికి సూచించాడని తెలిసింది. తమకుటుంబంతో మల్లారెడ్డికి ఉన్న అనుబంధాన్ని ఎప్పటికి మరువలేమని కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నాడని సమాచారం.

## హైదరాబాద్ నుండి అమెరికాకు..

# నేరుగా ఎగరనున్న నాన్‌స్టాప్ విమానం



హైదరాబాదు శంషాబాద్ విమానాశ్రయం నుండి అమెరికాలోని చికాగో ఓహెర్ విమానాశ్రయానికి ఇక నుండి నేరుగా విమానం ఎగరనుంది. మధ్యలో ఎక్కడా ఆగకుండా ఎయిర్ ఇండియా విమానం బోయింగ్ 777-200, 238 మంది ప్రయాణీకులని అమెరికాకు మోసుకెళ్తుంది. 2021 జనవరి 15వ తేదీ నుండి ఇది ప్రారంభమవుతుంది. హైదరాబాదు నుండి నేరుగా అమెరికాకు వెళ్లనున్న మొదటి నాన్‌స్టాప్ ఫ్లైట్ ఇదే.

ఈ విమానం, 8ఫస్ట్ క్లాస్, 35 బిజినెస్ క్లాస్, 195 ఎకానమీ క్లాస్‌తో మొత్తంగా కలిపి 238 మందికి సీటింగ్ కెపాసిటీ కలిగి ఉంటుంది. ఏటా 2.2లక్షలకు మందికిపైగా హైదరాబాద్ చుట్టుపక్కల నుంచి అమెరికాకి వెళ్లే వారికి సేవలందించేందుకు ఈ విమానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ బబుల్ ఒప్పందం కింద బ్రిటిష్ ఎయిర్‌వేస్ వంటి విమానయాన సంస్థలు కూడా హైదరాబాద్-బ్రిటన్‌ని కలిపే కార్యకలాపాలను తిరిగి ప్రారంభించగా, ఎమిరేట్స్, ఇతిహాద్, ఫ్లై దుబాయ్ మరియు ఎయిర్ అరేబియాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని వివిధ గమ్యస్థానాలతో హైదరాబాద్‌ని కలుపుతూ తమ సేవలను తిరిగి ప్రారంభించాయి. ఖతార్ ఎయిర్‌వేస్ కూడా హైదరాబాద్‌ను దోహాతో తిరిగి కనెక్ట్ చేసేసింది. మొత్తానికి నిదానంగా ఒక్కొక్కటిగా అంతర్జాతీయ విమాన సర్వీసులకు మళ్ళీ రెక్కలొచ్చాయి.

# రేషన్ బియ్యం దొంగలు
# తడలో దొరికారు..



- తెరవెనుక బడా బాబులు... లక్షల్లో ఆదాయం
- మామూళ్ల మత్తులో అధికారులు
- వాటాలలో తేడా వచ్చి... వాళ్ళే సమాచారమిచ్చి పట్టించిన స్మగ్లర్లు
- చెన్నై నుండి తడకి, తడ నుండి పోర్టులకి, అక్కడి నుండి విదేశాలకి తరలిపోతున్న రేషన్ బియ్యం
- కిలో 10 నుండి 13 రూపాయల వరకూ కొని 20 నుండి 25 రూపాయలవరకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది.

రేషన్ బియ్యం భారీగా తరలిపోతున్నాయి. ఎక్కువగా తమిళనాడు నుండి మన రాష్ట్రానికి వస్తున్నవే కాకుండా మన రాష్ట్రంలో కూడా అవి బహిరంగ మార్కెట్లోకి వెళ్తున్నాయి. ఇక్కడనుండి అవి ఎక్కడికి పోతున్నాయి, ఎక్కడికి చేరుతున్నాయి...? దీనిపై పక్కా సమాచారంతో నిఘాపెట్టాడు చిత్తూరు జిల్లా ఎస్‌పి సెంథిల్‌కుమార్. ఇందుకోసం సత్యవేడు సబ్‌ఇన్స్‌పెక్టర్ నాగార్జునరెడ్డిని నియమించాడు. నాగార్జునరెడ్డి తీగ లాగాడు... డొంక కదిలింది. ఏకంగా 110 టన్నులు అంటే సుమారు 2050 బస్తాలు, 1,02,500కిలోల(ఒక లక్షా రెండు వేలా ఐదువందల కిలోలు) రేషన్ బియ్యాన్ని 3 లారీలు, 4 ట్రక్కు ఆటోలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా తడలో పట్టుకున్నాడు.

మొత్తం వ్యవహారమంతా తెలుసుకోబోతే ఇది పెద్ద స్కాంగా తేలింది. 21 మందిని నేరస్తులుగా తేల్చారు. 8 మందిని కట కటాల వెనక్కు పంపారు. ఇంకా 13 మంది కోసం గాలిస్తున్నారు.

పూర్తి వివరాల్లోకి వెళ్తే ...

అటు తమిళనాడులోనూ, ఇటు ఆంధ్రాలోనూ పేదవాళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని వ్యాపారానికి ఆసరాగా చేసుకుని దందా మొదలు పెట్టిందో ముఠా. కిలో రెండు రూపాయలకో లేక ఉచితంగానో ఇచ్చే బియ్యాన్ని వీళ్ళు నేరుగా డీలర్ దగ్గరనుండి గాని లేదా వినియోగదారుల దగ్గరనుండి గాని కిలో 10 నుండి 13 రూపాయలకు కొనుగోలు చేస్తారు. ఈ మొత్తం బియ్యాన్ని ఒక దగ్గరకు చేర్చి వీటిని రీసైక్లింగ్ చేసి మంచి బియ్యంలో కలిపి మన రాష్ట్రంలోనే అమ్మేయడమో లేక విదేశాలకు తరలించడమో చేస్తారు. వివిధ ప్రాంతాల నుండి సేకరించిన బియ్యాన్ని రైళ్ల ద్వారా, లారీల ద్వారా, ట్రక్కు ఆటోల ద్వారా ఒక చోటుకు చేర్చి అక్కడినుండి తమకు కావాల్సిన ప్రదేశాలకు తరలిస్తారు. ఇందుకోసం రెవెన్యూ, విజిలెన్సు అధికారులకు నెల మామూళ్లు ఏర్పాటు చేస్తారు. వాళ్ళు ఈ వాహనాలు వచ్చినప్పుడు చూసీచూడనట్లు వదిలేస్తారు. ఎక్కువ శాతం కాకినాడ పోర్టుకి వెళ్తున్నట్లు సమాచారం. డిసెంబర్ 9వ తేదీ పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఈ ముఠా గుట్టు రట్టు చేశారు. కోట్ల రూపాయలలో లావాదేవీలు జరుగుతున్న ఈ వ్యవహారంలో చాలామంది బడా బాబుల హస్తం ఉందంటున్నారు. ప్రస్తుతానికైతే తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన 21మందిపైన కేసులు నమోదుచేసి 8 మందిని అరెస్టు చేశారు.

వాటాల విషయంలో స్మగ్లర్లలో వాళ్ళల్లో వాళ్ళకే విభేదాలు వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు కూడా చెప్తున్నారు. ఏదిఏమైనా ఇది చాలా పెద్ద వ్యవహారం. ఉన్నతాధికారులు ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసి తెరవెనుక ఉన్న బడా చోరులను బయటకు లాగాలి.

## తెరుచుకున్న బడి...
# కనిపించని సందడి

**కరోనా దెబ్బకి కుదేలైన విద్యా రంగం**

***కరోనా మహమ్మారి ప్రభావం వ్యాపార రంగంతో పాటు విద్యా రంగంపై కూడా తీవ్రంగా పడిందనే చెప్పాలి. మళ్ళీ... బళ్ళు పేరుకు తెరుచుకున్నాయే తప్ప ఎక్కడా పాత సందడి కనిపించడం లేదు.***



పిల్లలు బడికి ఎందుకు రావడం లేదు...? అన్న ప్రశ్నకు కరోనా కారణమే కాదన్న సమాధానం కూడా ఎక్కువగా వినిపిస్తోంది. తమ పిల్లల్ని తీసుకుని శుభకార్యాలకు, షాపింగులకు, గుళ్లకు వెళ్తున్న అమ్మానాన్నలు బళ్లకు ఎందుకు పంపడం లేదో ఒక్కసారి ఆలోచించుకోవాలంటున్నాయి విద్యాసంస్థల యాజమాన్యాలు. లోతుగా ఆలోచిస్తే ఆర్థిక వ్యవహారాలే కారణమన్నది వారి అభిప్రాయం.

సహజంగా అన్ని స్కూళ్లలో, కాలేజీలలో మార్చి చివరి వారం కానీ లేదా ఏప్రిల్ మొదటి రెండు వారాలలో పరీక్షలు ముగించి ఆ విద్యాసంవత్సరానికి మంగళం పాడి సెలవులు ఇచ్చేస్తారు. పరీక్షలకి ముందే పిల్లలు కట్టవలసిన పాత బకాయిలన్నీ వసూలు చేసేస్తారు, బకాయిలు చెల్లించకుంటే పరీక్ష రాయించరేమోనన్న భయంతో తల్లితండ్రులు కూడా పూర్తిగా చెల్లించేస్తారు. ఇలా చివరి నిముషంలో వసూలు అయ్యే మొత్తం ఒక్క నెల్లూరు జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలలోనే కోట్లరూపాయలలో ఉంటుందంటే అతిశయోక్తి కాదు. ఈసారి ఆ వసూళ్లకు కరోనా అడ్డుకట్ట వేసింది. మార్చి మూడవ వారం నుండి అమలైన లాక్‌డౌన్... విద్యా సంస్థల పాలిట శాపమైంది. పాత బకాయిలు మొత్తం ఆగిపోయాయి, మళ్ళీ జూన్ నుండీ ప్రారంభం కావల్సిన విద్యా సంవత్సరం మొదలుకాలేదు. చదువులు లేవు, పరీక్షలు లేవు, ఫీజులు లేవు. ఆన్‌లైన్ తరగతులు జరుగుతున్నా అవి సంతృప్తికరంగా తమ పిల్లలకు అర్ధమయ్యేలా స్కూళ్ళు, కాలేజీల యాజమాన్యాలు చర్యలు తీసుకుంటున్నా, నామ మాత్రం ఫీజులు చెల్లించడానికి కూడా ఎక్కువ శాతం తల్లిదండ్రులు ఇష్టపడడం లేదని యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి.

కొన్ని కాలేజీల్లో అయితే హాస్టల్ ఫీజులతో సహా బకాయిలు ఉన్నాయని, కనీసం మెస్ ఫీజులు కట్టమన్నా పేరెంట్స్ స్పందించడంలేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. హాస్టల్లో వున్న తమ పిల్లల లగేజిని తీసుకోవడానికి కూడా రావడంలేదని, వాటిని కాపాడడం ఇప్పుడు తమకొక అదనపు ఖర్చని స్కూలు, కాలేజీ యాజమాన్యాలు తమ గోడును వెళ్లగక్కుతున్నాయి.

ఇప్పుడు పాఠశాలలో ఉన్నత తరగతులతో పాటు, కాలేజీలను తెరుచుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికి.. వస్తే పాత బకాయిలు ఎక్కడ అడుగుతారో అని చాలామంది రావడంలేదని, వచ్చిన వారిని ఫీజులు కట్టమంటే తాము కట్టలేమని, టిసి ఇస్తే వెళ్లిపోతామని అంటున్నారని, ఆన్‌లైన్ క్లాసులు జరిగాయి కదా అని అడిగితే మా ఊర్లో ఇంటర్నెట్ రాదని, మా ఇంట్లో సెల్ సిగ్నల్ లేదని... కాబట్టి మేము ఆన్‌లైన్ తరగతులు వినలేదు, చూడలేదని చెప్పడం వినడానికే విడ్డురంగా ఉందన్నది యాజమాన్యాల ఆవేదన.

మరోవైపు పెద్ద సంస్థలలో మీరు ఎక్కువ ఫీజులు చెల్లించనవసరం లేదని, అక్కడ టిసి తీసుకుని వస్తే అక్కడ తీసుకునే ఫీజులో నాలుగవ వంతు మాకు చెల్లిస్తే చాలని కొన్ని చోటా సంస్థలు ప్రచారం చేస్తూ పిల్లలకు గాలం వేస్తుండడంతో... మంచి విద్యతో పాటు పిల్లలకు మంచి సౌకర్యాలు కూడా అందించాలన్న ఉద్దేశంతో ఇన్నాళ్లు కోట్ల రూపాయలు వెచ్చించి తాము పడ్డ తపనకు విలువ లేకుండా పోయిందని యాజమాన్యాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్ని కష్టాలొచ్చినా తమ సిబ్బంది ఇబ్బంది పడకూడదని ఇన్నాళ్లు జీతాలు చెల్లించామని, పరిస్థితి ఇలాగే కొనసాగితే జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చి చాలా సంస్థలు మూతపడే ప్రమాదముందని కూడా కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్తున్నాయి.

స్కూళ్లలోనైనా కాలేజీలలో అయినా ఇప్పుడు పిల్లలు రావడం లేదంటే కరోనా కారణం కాదని, కరెన్సీయే అసలు కారణమన్నది చాలామంది అభిప్రాయం. ఒకవేళ ఇదే నిజమైతే, అమ్మానాన్నలు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. పిండి కొద్దీ రొట్టె అన్నారు పెద్దలు. తమ పిల్లలు మంచి స్కూళ్లలో చదువుకోవాలి, మంచి వసతులు ఉన్న చోట నాణ్యమైన విద్య అభ్యసించాలి అనుకునే వారు ఇప్పుడు ఇలా ఆలోచించడం సబబు కాదు. చిన్నా, పెద్దా అన్న తేడాలేకుండా అన్ని స్కూళ్ళూ మంచి విద్యనే అందిస్తాయి. అయితే బోధనా విధానాలలో ఆధునిక పద్ధతులు అవలంభించే కొన్ని సంస్థలు మారుతున్న కాలంతో పాటు తమను తాము ఆధునీకరించుకుంటూ, తమ స్కూల్ పిల్లలను తీర్చిదిద్దుతారు.

ప్రభుత్వం కూడా 70శాతం ట్యూషన్ ఫీజులు చెల్లించమనే చెప్తోంది, అదీ సులభ వాయిదాల్లో చెల్లించమంటోంది. ఉభయ కుశలోపరి సిద్ధాంతంతో అటు యాజమాన్యాలు... ఇటు అమ్మానాన్నలు ఇద్దరూ మారి తమ పిల్లల బంగారు భవిష్యత్తుకి బలమైన పునాదులు వేసుకోవాలి.

## డిమాండ్లతో సాగిన
# పవన్ నివర్ పర్యటన



నివర్ తుఫాను ప్రభావ ప్రాంతాల్లో పర్యటించే కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పర్యటన 4, 5 తారీఖులలో నెల్లూరుజిల్లాలో సాగింది. నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి, నెల్లూరులలో పర్యటించాడు. ఆయన పర్యటన ఆద్యంతం డిమాండ్లతో సాగింది. ఆత్మహత్య చేసుకున్న రైతులకు 5 లక్షలు, పంట నష్టం జరిగిన రైతులకు 25 నుండి 35 వేలు, కౌలురైతుకి 10వేలుతో పాటు, మొత్తంగా అందరికీ తక్షణ సహాయం క్రింద ప్రభుత్వం వెంటనే 10వేల రూపాయలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశాడు.

4వ తేదీ నాయుడుపేట గూడూరుల మీదుగా నెల్లూరుకు చేరుకున్న పవన్, అదేరోజు జనసేన పార్టీ నెల్లూరుజిల్లా పార్లమెంటరీ ఇన్‌ఛార్జ్ చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మినర్వా హోటల్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మాట్లాడాడు. 5వ తేదీ ఉదయం వెంకటేశ్వరపురం, ఇనుమడుగు సెంటర్లలో పర్యటించి, గూడూరుకు బయలుదేరాడు. గూడూరు దగ్గర రహదారిని పరిశీలించి అటు నుండి వెంకటగిరి చేరుకున్నాడు. వెంకటగిరిలో చేనేత కార్మికులను కలుసుకొని వారు పడుతున్న అవస్థలను ప్రభుత్వానికి తెలియజేస్తామని భరోసా ఇచ్చాడు. పవన్ వెంట నెల్లూరు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి మనుక్రాంత్‌రెడ్డితో పాటు ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

పాలకులు అనారోగ్యం నుంచి జనారోగ్యాన్ని కాపాడేందుకు, 'అందరికీ ఆరోగ్యం' అందించేందుకు ఏళ్ళ తరబడిగా కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నా ఆచరణలో మాత్రం ప్రజారోగ్యం నానాటికీ క్షీణిస్తూనే ఉంది. అనేకరకాలైన వ్యాధులు బాధలతో ప్రజలు నిత్యం పడే యాతనలు వర్ణనాతీతం. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఇలా అన్ని కాలాల్లోనూ లేనిపోని రోగాలకు, రకరకాల వ్యాధులకు గురవుతూనే ఉంది. ఎప్పటికప్పుడు కొత్తకొత్త వ్యాధులు, అంతుపట్టని వింత వ్యాధులు కూడా విజృంభిస్తూ ప్రజలను భయకంపితుల్ని చేస్తూనే ఉన్నాయి. ఆ మాయదారి రోగాల దాడికి తట్టుకోలేక ఎంతోమంది మృత్యువాత పడుతూనే ఉన్నారు.

ఈ అత్యాధునిక కాలంలో శాస్త్రపరిజ్ఞానం భారీస్థాయిలో విస్తరిస్తున్నా ప్రజలను పట్టి పీడిస్తున్న వ్యాధుల నివారణలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. ముఖ్యంగా మనదేశంలో ప్రజారోగ్య వ్యవస్థలు పటిష్టవంతంగా లేకపోవడంతో వ్యాధుల విజృంభణ మరింత తీవ్రంగా ఉంటోంది. వ్యాధుల నివారణకు ఒకవైపు ఎంతగానో కృషి జరుగుతూనే ఉన్నా, మరోవైపు వ్యాధుల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. సరైన పౌష్టికాహారం లేకపోవడం, వ్యాధి నిరోధకశక్తి పెంపొందకపోవడం, ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు తగ్గ బలమైన ఆరోగ్యవ్యవస్థలు లేకపోవడం, నానాటికీ రకరకాల కాలుష్యాలు పెరిగిపోతుండడం వంటి ఎన్నో లోపాలు ప్రజలకు శాపాలుగా పరిణమిస్తున్నాయి.

అందులోనూ ఇది కరోనా నామ సంవత్సరం. వ్యాధుల్లోకెల్లా మహమ్మారి వ్యాధి ఇది. ఎక్కడో చైనాలో పుట్టి ప్రపంచాన్నంతటినీ చుట్టి.. ఈ సకల భూప్రపంచంలోని ప్రతి మనిషినీ నిలువెల్లా వణికించిన కరోనా రాకాసి విలయతాండవం చేసిన సంవత్సరం.. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధితో ఇప్పటికీ విలవిలలాడుతున్న వారి సంఖ్య 6 కోట్ల 87 లక్షల మందికి పైగానే ఉంది. రేపో మాపో అది 7 కోట్లకు చేరనుంది కూడా. ఈ వ్యాధి బారిన పడి ప్రపంచంలో ఇప్పటికి 15.67 లక్షల మంది మరణిస్తే, ఒక్క మనదేశంలోనే లక్షా 41 వేలా 360 మంది దాకా ఈ వ్యాధికి బలైపోయారంటే ఈ మహమ్మారి వ్యాధి మానవాళిని ఎంతగా కబళిస్తూ ఉందో తేటతెల్లమవుతుంది. అయితే కోలుకుంటున్న వారి సంఖ్య కూడా ఎంతో ఆశాజనకంగా ఉండడం సంతోషదాయకం. ఈ రాకాసి వ్యాధి ఇటీవల తగ్గుతున్నట్లు అనిపించినా మరోవైపు నుంచి విజృంభిస్తూనే ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు హడలెత్తిపోతున్నారు. పలు దేశాల్లో రెండవసారి లాక్‌డౌన్ విధించగా, మన దేశంలోనూ పలు రాష్ట్రాల్లో మళ్ళీ లాక్‌డౌన్‌ను కొనసాగిస్తున్నారు.

ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు తగ్గ మందులు ఇంకా రాలేదు. అయితే త్వరలోనే కరోనా నిరోధానికి వ్యాక్సిన్ వస్తుందనే ఆశతో ప్రపంచ ప్రజలంతా వేయికళ్ళతో ఎదురుచూస్తూనే ఉన్నారు. లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న ఏడాది కనుక.. 2020 అంటేనే కోవిడ్ సంవత్సరంగా.. అంతుపట్టని వింతవ్యాధుల సంవత్సరంగా.. సకల మానవాళికీ అత్యంత విషాదకరమైన సంవత్సరంగా చరిత్రలో నిలిచిపోనుంది.

ఇదిలావుంటే, 2020వ సంవత్సరమంతా ప్రపంచానికి కరోనా భయంతోనే గడిచిపోతోంటే, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో మాత్రం మరో అంతుచిక్కని వ్యాధి వచ్చిపడి ప్రజలను భయపెడుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన ఏలూరులో గత వారం రోజులుగా ఆ వింతవ్యాధి విజృంభిస్తూ ప్రజలను గడగడలాడిస్తూనే ఉంది. ఇప్పటికే సుమారు 450 మంది దాకా ప్రజలు ఈ వ్యాధి బారినపడి ఆసుపత్రుల్లో చికిత్సలు పొందారు. చిన్నారుల నుంచి వృద్ధుల దాకా ఎంతోమంది ఈ వ్యాధితో హటాత్తుగా మూర్ఛపోయి నోటిలో నురుగులు వచ్చి గిలగిల కొట్టుకుంటూ పిట్టల్లా నేలరాలడం ఎంత దయనీయం!.. ఈ వ్యాధి బాధితుల్లో ముగ్గురు ఇప్పటికే అలా ప్రాణాలు కోల్పోయారు కూడా. వైద్యనిపుణులకు కూడా ఈ వ్యాధి అంతుపట్టకపోతుండడం విచిత్రం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ వ్యాధిపై దృష్టి సారించి ఈ వ్యాధి విషయం తేల్చడానికి రంగంలోకి దిగింది. ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు చేసిన వైద్యపరీక్షల్లో.. బాధితుల శరీరాలల్లో సీసం, నికెల్ వంటి మూలకాలు అధికంగా ఉన్నాయని తెలుస్తోందని, అవి వారిలోకి ఎలా చేరాయో మాత్రం తెలియడం లేదని అంటున్నారు. కూరగాయల సాగులో మోతాదుకు మించి రసాయనాలు వాడడం వల్లనో, పాలల్లో కల్తీల వల్ల, లేదా నీళ్ళ కాలుష్యం వల్లనో ప్రజలు ఈ వింతవ్యాధికి గురవుతున్నారేమోనని అనుకుంటున్నారే తప్ప ఈ వ్యాధికి అసలైన కారణాలేమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. వ్యాధి మూలాలు తెలిస్తే తప్ప నివారణ సాధ్యం కాదు కనుక నిపుణులు ఆ దిశగా నిరంతర పరిశోధనలు చేస్తున్నారు. ఇది పాలతో వచ్చిందో.. నీళ్లతో వచ్చిందో తెలియదు కానీ..చివరికి ఇది ఏలూరు ప్రజలను పాల ముంచుతుందో.. నీట ముంచుతుందో ఆ దేవుడికే తెలియాలి. ఇక్కడొక మాట!.. ప్రజలపై ఇలాంటి రోగాల విపత్తుల దాడి చేస్తున్నప్పుడు దేశమంతా ఒక్కటై వైద్యనిపుణులు, సిబ్బంది సాయంతో ఆ ప్రాణాంతక వ్యాధులను తరిమికొట్టేందుకు సమాయత్తం కావాలి. బాధితులను ప్రభుత్వాలు, ప్రజలు మానవతా దృక్పథంతో అన్నివిధాలా ఆదుకోవాలి.

ఏదేమైనా.. దేశంలో మన ఆరోగ్యవ్యవస్థలు ఎంత దీనావస్థలో ఉన్నాయో ఇప్పటికే కరోనా వైరస్ మన డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. ఇది ఒకరకంగా మనకొక గుణపాఠమేనని చెప్పక తప్పదు. ఇకనైనా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని దేశవ్యాప్తంగా మన ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసుకోకుంటే, ఆరోగ్యరక్షణకు చిత్తశుద్ధితో తక్షణం అన్నిరకాలైన పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే.. భవిష్యత్తులో ఇంకెన్ని రకాల వ్యాధులు ప్రజల్ని చుట్టుముడతాయో చెప్పలేం.

### వింత వ్యాధుల 2020



ప్రపంచవ్యాప్తంగా జనం కరోనాతో బెంబేలెత్తిపోతుంటే ప్రత్యేకించి ఆంధ్ర ప్రదేశ్‌లోని ఏలూరులో మాత్రం కరోనాతో పాటు మరో అంతుచిక్కని వ్యాధి కూడా వచ్చిపడి ప్రజలను భయపెడుతోండడం ఇంకా బాధాకరం. దేశంలో మన ఆరోగ్యవ్యవస్థలు ఎంత దీనావస్థలో ఉన్నాయో ఇప్పటికే కరోనా వైరస్ బట్టబయలు చేసింది. ఇది ఒకరకంగా మనకొక గుణపాఠమే. ఇకనైనా ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసుకోకుంటే భవిష్యత్తులో ఇంకెన్ని రకాల వ్యాధులు ప్రజల్ని చుట్టుముడతాయో చెప్పలేం.

---

### నెల్లూరు బీఇడి కాలేజీలో కంప్యూటర్లు లేవు..

# దాతలు దయ చూపాలి

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com

114 సంవత్సరాలుగా ఎంతోమంది పేద విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్ది, అతి పురాతన బోధనా కేంద్రంగా ప్రాచుర్యం పొందిన నెల్లూరు సంతపేటలోని ప్రభుత్వ బీఇడి కాలేజీ ఇప్పుడు నిర్లక్ష్యానికి గురయ్యింది. కొన్ని వేలమందికి శిక్షణ ఇచ్చి టీచర్లుగా తయారుచేసి సమాజానికి అందించిన ఘనచరిత్ర ఈ కాలేజీది. జిల్లాలోనే మొట్టమొదటి బీఇడి కాలేజి ఇది. ప్రైవేట్ రంగంలో అనేక బిఈడి కళాశాలలకు అనుమతులు రావడంతో, ఈ కాలేజీలో చేరేవారి సంఖ్యా గణనీయంగా పడిపోయింది. విశాలమైన ప్రాంగణంలో అతి పురాతన భవనాలు ఉన్నాయేతప్ప ఇక్కడ తగిన వసతులులేవు. ఇపుడు మేము కేవలం 80 మందిమి ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నాం. మా 80 మందికి అవసరమైన కంప్యూటర్లు కూడా ఇక్కడ లేవు, ఇక్కడ చదువుకునే వారమంతా చదువు కొనలేని నిరు పేదవాళ్లం. ఈ కాలేజీ మీదే మా భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇక్కడ వసతుల విషయమై ఎన్ని సార్లు విన్నవించుకున్నా గవర్నమెంటోళ్లు మా మొర ఆలకించడంలేదు, ఎవరైనా దాతలు ముందుకొచ్చి మాపై దయ చూపించాలని కోరుకుంటున్నాం. కేవలం 10 కంప్యూటర్లు ఉంటే మాకు ఊరట లభిస్తుంది. పాత కంప్యూటర్లు ఇచ్చినా వాటిని మరమ్మత్తు చేసుకుని వాడుకుంటాం. కొత్తవి కొనాలన్నా కేవలం లక్షా యాభై వేలవుతుంది. ఇంత చిన్న మొత్తాన్ని మాపై ఖర్చుపెట్టడానికి కూడా ప్రభుత్వ పెద్దలకు దయకలగడంలేదు సహృదయం కలిగిన సమాజ సేవకులు ముందుకొచ్చి మాకు కంప్యూటర్ల వసతి ఏర్పాటు చేయవలసిందిగా వేడుకుంటున్నాం.

విద్యార్థినీ విద్యార్థులు,
ప్రభుత్వ బీఇడి కాలేజి, నెల్లూరు.

## దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

నెల్లూరు నగరంలో చాలాచోట్ల ఖాళీ స్థలాలు మట్టి నింపకుండా ఉండడంతో అవి మురికి గుంటలుగా, నీటి మడుగులుగా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. కార్పొరేషన్ అధికారులు జోక్యం చేసుకుని స్థల యజమానులకు నోటీసులిచ్చి ఖాళీ స్థలాలలో మట్టి నింపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఇటీవల కురిసిన వానలతో నగరంలో చాలాచోట్ల ఖాళీ స్థలాల పరిస్థితి ఇదే. ఇళ్ల మధ్యలో ఉన్న వాటిని ఇలాగే వదిలేస్తే దోమలు పెరిగి వాటి ద్వారా రోగాలొచ్చి నెల్లూరు కూడా మరో ఏలూరయ్యే ప్రమాదం ఉంది. తస్మాత్ జాగ్రత్త!..

జె. యస్. కృష్ణ, నెల్లూరు.

**లాయర్**

**పాఠకులకు మనవి**
**మా(మీ) లాయర్ పత్రికకు**
**సమాచారం / లేఖలు**
**పంపదలచిన వారు**
**9866314741 నంబరుకు**
**వాట్సయాప్ ద్వారా గాని, లేదా**
**lawyerpatrika@gmail.comకి**
**ఈ-మెయిల్ ద్వారా గాని**
**పంపవలసిందిగా విజ్ఞప్తి.**
**పోస్టల్ చిరునామా :**
**ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,**
**మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.**
**- సం/-**

## స్టేట్ బ్యాంకు నిర్లక్ష్యాన్ని కళ్ళకు కట్టారు

'హేట్'బ్యాంకుగా మారుతున్న స్టేట్ బ్యాంకు అంటూ గతవారం లాయర్‌లో ప్రచురించిన వార్తలో స్టేట్ బ్యాంకు ఖాతాదారుల కష్టాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ బ్యాంకులో సామాన్యులకు విలువే లేదు. ఎవరో ఒకరోఇద్దరో తప్ప మిగిలిన స్టాఫ్ మొత్తం నిర్లక్ష్య ధోరణితోనే పనిచేస్తారు. కోట్లరూపాయల లావాదేవీలు చేసే ధనస్వాములకు వీళ్ళు సలాం చేస్తూ సేవలు అందిస్తారు. పేద పెన్షన్‌దారులను, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను అసలు లెక్కపెట్టరు. మీరు పేర్కొన్నట్లుగా రూల్సు పాటించరు. కష్టమర్లను విసుక్కుంటారు. వాళ్లకేదో గతిలేక ఈ బ్యాంకుకు వచ్చినట్లుగా అకౌంటుదారులను పరిగణిస్తారు. నిజమే మీరు రాసినట్లు స్టేట్ బ్యాంకు హేట్ బ్యాంకుగా అవతరిస్తోంది. దాదాపుగా అన్ని ప్రభుత్వరంగ సంస్థల అకౌంట్లు ఈ బ్యాంకులో ఉండడమే వీరి అహంభావానికి కారణం. ఇప్పటికైనా ఈ బ్యాంకు సిబ్బంది మారి సామాన్యులకు చేరువ కావాలని ఆశిస్తున్నాను.

ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.

## గ్రేటర్ ఫలితాలు కేసీఆర్‌కి కనువిప్పు..!

హైదరాబాదు మేయర్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అనూహ్యంగా పుంజుకుని ఎక్కువ సీట్లు సాధిస్తుందన్నది అందరమూ ఊహించిందే. ఈ ఫలితాలవల్ల తెలంగాణా రాష్ట్రీయ సమితికి సీట్లు తగ్గుతాయి తప్ప మేయర్ పదవి వాళ్లదే అన్న సంగతి కూడా అందరికీ తెలిసిందే. అయితే ఇక్కడ అందరమూ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. 2020మార్చి మాసం చివరి వారం నుండి వచ్చిన లాక్‌డౌన్‌ని కేటిఆర్ చక్కగా వాడుకున్నాడు, హైదరాబాదులో అసంపూర్ణంగా వున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలను పూర్తి చేయడంలోనూ, కొత్తగా రోడ్లను నిర్మించి వాటిని ప్రధాన మార్గాలకు అనుసంధానం చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించడంలోనూ కేసిఆర్ నాయకత్వంలో కేటిఆర్ సమర్ధవంతంగా పనిచేశాడు. గత మాసం హైదరాబాదుతో పాటు పరిసర ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో తెలంగాణా ప్రభుత్వం విఫలం కావడమే గ్రేటర్ ఎన్నికలలో ప్రతిపక్షాలకు ప్రచార అస్త్రంగా మారింది. ఒకరకంగా ఈ ఫలితాలు టిఆర్ఎస్ పార్టీకి మేల్కొలుపు లాంటివే అని చెప్పొచ్చు. తమకు ఎదురు లేదనుకుంటున్న కల్వకుంట్ల కుటుంబం రాబోయే ఎన్నికలలో జాగ్రత్త పడడానికి ఈ ఫలితం ఉపయోగపడుతుంది.

కె. విద్యాసాగర్, హైదరాబాదు.

# వాణిజ్య వారధిగా.. పలు బ్రాండ్లకు వేదికగా.. అభివృద్ధి చెందుతున్న

# మినీ బైపాస్

**నెల్లూరు పుట్టినప్పటి నుంచి ఏకైక ప్రధాన రహదారిగా అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండు వరకు విస్తరించిన గ్రాండ్ ట్రంకురోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఇప్పుడు మినీబైపాస్ (రాజీవ్ రహదారి) శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.**

తూర్పు పడమరల మధ్య నగరాన్ని రెండుగా చీలుస్తూ రైలు పట్టాలు ఉండడంతో నెల్లూరునగరం తూర్పువైపు కంటే పడమర వైపే ఎక్కువగా విస్తరించింది. 1990 దశకంలో అప్పటి నగర శాసన సభ్యుడు జెకె రెడ్డి చొరవతో మినీబైపాస్ ప్రతిపాదనకు ఊతం వచ్చింది. ఆ తరు




వాత కాలంలో ఒంగోలు పార్లమెంటు సభ్యుడు, దానకర్ణుడిగా పేరు పొందిన మాగుంట సుబ్బరామరెడ్డి జోక్యంతో 1993-94 సంవత్సారాల మధ్య మినీ బైపాస్‌కి ప్రాణ ప్రతిష్ట జరిగి, అయ్యప్పగుడి నుండి రామలింగాపురం కూడలి వరకు ఈ రోడ్డు ఏర్పడింది. రాజీవ్ రహదారిగా ఈ రోడ్డుకి నామకరణం చేసినప్పటికీ మినీబైపాస్‌గానే ఈ రహదారి ప్రసిద్ధి చెందింది. గతంలో మూలాపేట, పెద్దాసుపత్రి, రంగనాయకులపేట మీదుగా వెళ్తుండిన చెన్నై-విజయవాడ ట్రాఫిక్ 1996 నుండి దారి మళ్లి మినీబైపాస్ మీదుగా ఆత్మకూరు బస్టాండు వద్ద కలిసి పోయేది. తరువాతి కాలంలో మేజర్ బైపాస్ నిర్మాణం జరగడం, 2004లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి హస్తాలమీదుగా అది ప్రారంభం కావడంతో మినీ బైపాస్




నగర ట్రాఫిక్కుకి మాత్రమే పరిమితమై పోయింది. అయితే తూర్పు నుండి పడమరకు రావాలంటే అన్ని రైల్వే గేట్లు లేదా అండర్ బ్రిడ్జిలు దాటడం సమస్యగా ఉన్న తరుణంలో 2006 తరువాతి కాలంలో అయ్యప్ప గుడి వద్ద గేటు స్థానంలో రైల్వే వంతెన(ఫ్లై ఓవర్) నిర్మాణం జరగడం, తూర్పు పడమరలను కలిపే తొలి ఫ్లైఓవర్ అదే కావడంతో మినీబైపాస్‌పై రాకపోకలు ఒక్కసారిగా పెరిగాయి.

మాగుంట కుటుంబం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయబడ్డ మాగుంట లే-అవుట్‌తో పాటు గోమతినగర్, ఇస్కాన్ సిటీ, కావేరి నగర్ వంటి కొత్త నివాస ప్రాంతాలు అనేకం శరవేగంగా అభివృద్ధి చెందడంతో, ఇప్పుడు నగరం పడమర వైపు కూడా ప్రగతి పరుగులు పెడుతోంది.

ముఖ్యంగా మినీబైపాస్‌రోడ్డులో జాతీయ అంతర్జాతీయ బ్రాండ్లతోపాటు, బంగారు దుకాణాలు, వస్త్రాలయాలు, గృహోపకరణాల షోరూములు, రెస్టారెంట్లు అందుబాటులోకి వస్తున్నాయి. 2012లో ఆవిష్కృతమైన అన్నమయ్య విగ్రహం ప్రాంతం అన్నమయ్య సర్కిల్‌గా, 2007లో స్థాపించబడిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి విగ్రహ కూడలి బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌గా వాడుకలోకి వచ్చాయి. ఇప్పుడు పెట్టుబడిదారుల కళ్ళు మినీబైపాస్‌పై పడుతున్నాయి. ఒక్కొక్కటిగా















ప్రధాన బ్రాండ్లకు చెందిన షాపులు తెరుచుకుంటున్నాయి. త్వరలో సూపర్‌మార్కెట్లు, భారీ మాల్‌లు, సెల్‌ఫోన్ సెంటర్లు కూడా రానున్నాయి. అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థతో అల్లాడుతుండిన ట్రంకురోడ్డు వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు దిక్సూచిలా మినీబైపాస్ వాణిజ్య వారధిగా, జాతీయ అంతర్జాతీయ బ్రాండ్లకు వేదికగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

---

## దేవాదయ శాఖ ఎ.సిగా

# పోరెడ్డి శ్రీను



దేవాదయ ధర్మాదయ శాఖ సహాయ కమిషనర్‌గా నరసింహకొండ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఇక్కడ సహాయ కమిషనర్ రవీంద్రరెడ్డి పదవీ విరమణ చేసిన నాటినుండి వేణుగోపాలస్వామి దేవస్థాన ఇ.ఓ శ్రీనివాసరావు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాడు. ఇప్పుడు ఆ స్థానంలో పోరెడ్డి శ్రీనివాసులరెడ్డికి పూర్తిస్థాయి అదనపు భాధ్యతలను అప్పజెప్తూ దేవాదయ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చాడు.

దేవాదయ శాఖ ఉద్యోగిగా ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులో విధులు నిర్వహిస్తుండిన శ్రీనివాసులరెడ్డి 2007లో జిల్లాకు వచ్చాడు. ముందుగా మూలాపేటలోని ధర్మరాజస్వామి ఆలయ ఇ.ఓగా భాధ్యతలు చేపట్టాడు. తరువాత మూలపేట శివాలయంలోనూ, సూళ్లూరుపేట చెంగాళమ్మ సన్నిధిలోనూ ఆ తరువాత తల్పగిరి రంగనాధస్వామి వారి సేవలోనూ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహించి, ఇప్పుడు వేదగిరి లక్ష్మీనరసింహస్వామి చెంత ఉన్న తరుణంలో ఆయనకు ఈ యోగం లభించింది. డిసెంబర్ 9వతేది ఎ.సిగా భాధ్యతలు చేపట్టిన శ్రీనుకి 'లాయర్' అభినందనలు.



## వవ్వేరు బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తాం

బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకు అభివృద్ధికి చేయూతనందిస్తామని జాతీయ కోఆపరేటివ్ అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) డెప్యూటి డైరెక్టర్ సచిన్‌శర్మ చెప్పారు. ఈనెల 8న ఆయన బుచ్చిలోని వవ్వేరు, బుచ్చి బ్యాంకులను సందర్శించారు. వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డితో కలసి ఎరువుల గోడౌన్లను పరిశీలించారు. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా 20శాతం సబ్సిడీపై గోడౌన్ల ఏర్పాటుకు కృషిచేస్తామని చెప్పారు. ఆ తర్వాత బుచ్చి కో-ఆపరేటివ్ ఛైర్మెన్ శివరామకృష్ణారెడ్డితో కలసి బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకును సందర్శించి రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

---

## ఆయుష్ వైద్యులచే..

# శస్త్రచికిత్సలా?

**ఆల్లోపతి డాక్టర్ల నిరసన**




అల్లోపతి వైద్యంలోకి ఆయుష్ వైద్యులను అనుమతిస్తూ భారతీయ వైద్యమండలి తీసుకున్న నిర్ణయం సరికాదంటూ ఈనెల 8న నెల్లూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది నగరంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ నిర్ణయానికి నిరసనగా ఈనెల11వతేది ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల దాకా ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నామని, అత్యవసర సేవలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. ఆయుష్ విభాగం వైద్యులు ఎలాంటి శిక్షణ లేకుండా శస్త్రచికిత్సలు ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. దీంతో ప్రజలకు నష్టం వాటిల్లుతుంది కనుక ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో ఐఎంఏ జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి ఎంసిఎస్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస తేజ, డాక్టర్ అశోక్, వైద్యులు అమరేంద్రనాథ్‌రెడ్డి, రూపేష్, శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# రైతాంగ ఉద్యమం.. చరిత్రాత్మకం

**కేంద్రం భేషజాలకు పోకుండా.. ఆ చట్టాలను రద్దు చేయాలి**

**- మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి**



కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమానికి దేశమంతా మద్దతు పలుకుతోందని, రైతులకు మద్దతుగా చేపట్టిన భారత్‌బంద్‌తో దేశం మొత్తం స్తంభించిపోయిందని, రైతుల ఉద్యమం చరిత్రాత్మకమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నాడు. రైతాంగ ఉద్యమంపై ఈనెల 8న ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ, వరుసగా రెండుసార్లు అధికారం ఇచ్చి మోదీని ప్రధానిని చేసిన రైతులే రోడ్డెక్కినప్పుడు కేంద్రప్రభుత్వం భేషజాలకు పోకూడదని, రైతులకు ప్రయోజనం కలిగించే కొత్త చట్టాలను తీసుకురావాలని సూచించాడు. ఎంఎస్‌పిని చట్టబద్ధం చేయాలని, ప్రైవేటు కంపెనీలు రైతులతో చేసుకునే ఒప్పందాలు ఎంఎస్‌పికి పైబడే జరిగేలా చూడాలని, మార్కెటింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను కంపెనీలు ఇష్టారాజ్యంగా నిల్వచేస్తే వినియోగదారులపై భారం పడకుండా చూడడం కూడా అవసరమన్నాడు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఓ మెట్టుదిగి దేశమంతా వ్యతిరేకిస్తున్న ఆ చట్టాలను రద్దుచేస్తే రైతుల్లో ప్రధాని పట్ల మరింత విలువ పెరుగుతుందని, రాజకీయాలకు సంబంధం లేని రైతు ఉద్యమం విషయంలో కేంద్రం ఇన్ని రోజులుగా స్పందించకపోవడం దురదృష్టకరమని, దేశభవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ వెంటనే ప్రకటన చేయడంతో పాటు రైతుసంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన పేర్కొన్నాడు.

## పోర్టు కార్మికుల సమస్యలు తీర్చండి

కృష్ణపట్నం పోర్టు కార్మికుల సమస్యలు తీర్చాలంటూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ ఈనెల 8న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తొలగించిన కార్మికులను పనుల్లోకి చేర్చుకునేలా చూడాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు కబుర్లు

## మార్పుకు శ్రీకారం చుడదాం!

**- జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపు**



జిల్లాలో చెత్తాచెదారాన్ని, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన మంచి మార్పుకు శ్రీకారం చుడదామంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. 'మనం-మన పరిశుభ్రత' కార్యక్రమాన్ని విజయ వంతం చేయడం మనందరి బాధ్యతని అంటూ ఈనెల 7న నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది మనం తాగే పరిశుభ్రమైన నీరు, మన చుట్టూ ఉండే పారిశుధ్య పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. జిల్లాలో ఈనెల 7 నుంచి 21వ తేది వరకు వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపడ దామన్నారు. గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు, రైతులు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేద్దామన్నారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి, పలువురు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరిశుభ్రత కోసం విశేషకృషి చేస్తున్న పలువురిని ఆయన సత్కరించారు. ఆ తర్వాత కస్తూర్బా కళాక్షేత్రం నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

### బాధ్యతలు చేపట్టిన

## డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి





నెల్లూరు డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కెవి సాంబశివారెడ్డి ఈనెల7న బాధ్యతలు చేపట్టారు. డ్వామా పీడీగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్ నాగలక్ష్మి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ వచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సాంబశివారెడ్డికి కార్యాలయం సిబ్బంది సత్యనారాయణ, సోమయాజులు, రాజు తదితరులు కలిసి అభినందనలు చెప్పారు.

అదేవిధంగా డ్వామా పీడీగా తిరుపతయ్య ఈనెల 7న నెల్లూరులో బాధ్యతలు తీసుకున్నారు. గూడూరు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉన్న తిరుపతయ్యను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై డ్వామా పీడీగా నియమించిన విషయం తెలిసిందే. డిఆర్‌డిఏ, డ్వామాలకు కొత్త పీడీలుగా వచ్చిన సాంబశివారెడ్డికి, తిరుపతయ్యకు 'లాయర్' శుభాకాంక్షలు.

## తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

**డిసిసి నేత చేవూరు**



నివర్, బురేవి తుఫాన్లతో జిల్లా ప్రజలు అనేక కష్టనష్టాలకు గురయ్యారని, తుఫాను బాధితులను వెంటనే ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్‌రెడ్డి ఈనెల6న ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. తుఫాన్ల ప్రభావంతో వచ్చిన భారీవర్షాల వల్ల పంటలు నీటమునిగి వేలాదిమంది రైతులు బాధలుపడుతున్నారని, వారికి నష్ట పరిహారం అందించి ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరాడు. జిల్లాలోని కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలందరూ వెంటనే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వారికి తగు సహాయ సహకారాలందించాలని ఆయన కోరాడు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చాక సాధారణ పరిపాలన గాడితప్పిందని, రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటు తున్నాయని, విద్యుత్‌చార్జీలు పెరుగుతున్నా కూడా ప్రభుత్వం పట్టించుకో వడం లేదని విమర్శించాడు.



## పాలనా భాషగా తెలుగు

**- అమలుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్న యార్లగడ్డ**

పాలనా భాషగా తెలుగు భాషను అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని అధికారభాషా సంఘం అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. ఈనెల 7న ఆయన నెల్లూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ డా. హరేందిరప్రసాద్‌తో కలసి అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అందించే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజల వద్దకు చేరాలంటే అధికార భాషగా తెలుగు అమలుకావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగుభాష ఎలా అమలవుతుందో పరిశీలిస్తున్నామని చెప్తూ, పలు జిల్లాల్లో అధికార భాష అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. పాలనా భాషగా తెలుగును అమలుచేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తెలుగు భాష అమలుకు అందరూ కృషిచేయాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో అధికారభాషా సంఘం అభ్యులు మోదుగుల పాపిరెడ్డి, శ్రీమతి శరత్‌జ్యోత్స్న, చందు సుబ్బారావు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశపు ఆణిముత్యం.. డా. అంబేద్కర్

**- టిడిపి నాయకులు బీద, అబ్దుల్ అజీజ్**




భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత దేశానికే ఒక ఆణిముత్యమని, దేశానికి ఆయన చేసిన సేవలు అపూర్వమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జెన్ని రమణయ్య తదితర నాయకులు కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని టిడిపి కార్యా లయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆ మహనీయుని ఆశయాల బాటలో నడుస్తూ బడుగు బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందన్నారు. టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధర తగ్గించండి మహాప్రభో!

**కట్టెలతో వంటలు చేసి నిరసన తెలిపిన టిడిపి మహిళలు**

వంట గ్యాస్ ధర తగ్గించండి మహాప్రభో అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు మహిళా నాయకురాళ్ళు రోడ్డుపైనే కట్టెలతో వంటలు చేసి తమ నిరసన తెలిపారు. రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు, పేదలు బతకలేకపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 7న నెల్లూరు నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో వారు ఈ ఆందోళన నిర్వహించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న టిడిపి నాయకుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ అసలే కరోనాతో జనం నష్టాలతో అల్లాడుతుంటే ప్రభుత్వం మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచడం దారుణమన్నారు. పెట్రోల్ ధరలు, ఇళ్ల పన్నులు, నీటి పన్నులు పెంచి ప్రజలపై ప్రభుత్వం భారం మోపుతోందని, టిడిపి హయాంలో గ్యాస్ ధర 570 ఉంటే ఇప్పుడు 750కి పెరిగిందని విమర్శించారు. ప్రభుత్వం పేదలకు ఒక చేత్తో రూపాయి ఇచ్చి మరోచేత్తో పది రూపాయలు లాగేసుకుంటోందని దుయ్యబట్టారు. ఈ ఆందోళనలో టిడిపి మహిళా నాయకురాలు పనబాక భూలక్ష్మి, కె. విజయ, రేవతి, రోజారాణి, బివి లక్ష్మి, మల్లి నిర్మల, శైలజ, అబీదా సుల్తానా, మస్తాన్‌బీ, పద్మమ్మ, రాజేశ్వరి, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సేవలు భేష్!

**- అభినందించిన జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్**




జిల్లాలో హోంగార్డుల సేవలను జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అభినం దించాడు. 58వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణ, వివిధ విభాగాల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు ఎంతో అమోఘమని అన్నాడు. కరోనా కట్టడికి హోంగార్డులు అంకితభావంతో సేవలందిం చారని, 1963 డిసెంబరు 6న హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమైందని, పోలీసులతో సమానంగా సేవలందిస్తున్న వీరికి ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం పోలీసులతో సమానంగా వివిధ సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని చెప్పాడు. ఏఎస్పీ పి.వెంకటరత్నం మాట్లాడుతూ హోంగార్డులు ప్రజలకు సేవచేయడంలో ముందుండాలన్నారు. అనంతరం, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన హోంగార్డులకు జిల్లా ఎస్పీ జ్ఞాపికలు బహుకరించారు. హోంగార్డుల ఆర్ఐ వై.పాలరాజు, డిఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, ఇన్స్‌పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఆర్ఐలు శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమర జవాన్ల కుటుంబాలను ఆదరించాలి

**- సాయుధ దళాల పతాక దినోత్సవంలో వక్తలు**



దేశరక్షణలో ప్రాణాలర్పిస్తున్న వీరజవాన్లకు మనమెంతో రుణపడి ఉన్నామని, అమర జవాన్ల కుటుంబాలకు మనవంతు చేయూతనిచ్చేందుకు సైనిక సంక్షేమానికి విరాళాలు ఇవ్వాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సురేష్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. అమర జవాన్ల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు ఏటా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వ హిస్తున్నామన్నారు. నెల్లూరులోని కొండాయపాళెం గేటు సెంటర్‌లోని సైనిక్ భవన్‌లో ఈనెల 7న ఏర్పాటుచేసిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ సైనిక సంక్షేమనిధికి ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఎన్‌సిసి విద్యార్థులు చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు అందరూ శుభాకాంక్షలు చెప్పారు. తొలుత జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌ను కలిసి విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ హరీంద్రప్రసాద్, నాగరాజు, నరేంద్రబాబు, ప్రసాద్, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో జరుగుతున్న మండల పూజోత్సవాల సందర్భంగా ఈనెల 6న స్వామివారికి గణపతి హోమం, శ్రీవేలి పూజ, కలశపూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గండవరపు సునందమ్మ, వినోద్‌రెడ్డి, దీప, వంశీకృష్ణారెడ్డి, అర్చన వ్యవహరించారు. స్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష కార్యదర్శులు కుమార్, శేషగిరిరావు, సభ్యుడు రత్నం తదితరులు పర్యవేక్షించారు. కరోనా నేపథ్యంలో భక్తులు మాస్కులు ధరించి, నియమాలు పాటిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

## మన ఆరోగ్యవ్యవస్థ లోపాలను..

# కోవిడ్ బయటపెట్టింది

**● భవిష్యత్‌లోనైనా వాటిని సరిదిద్దుకోవాలి**

**- శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ వరప్రసాద్‌రెడ్డి**



కోవిడ్ వల్ల మన ఆరోగ్య వ్యవస్థలోని లోటుపాట్లు బయటపడ్డాయని, ప్రభుత్వాలు ఇకనైనా భవిష్యత్తులో రాబోయే విపత్తులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ కెఐ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా మౌలిక వసతులు బాగా పెంచుకోవాలని, ప్రభుత్వ పరిశోధక సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు అవసరమైన వసతులను బలోపేతం చేయాలని సూచించారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 7న ఆయన 'కోవిడ్-19 విపత్కర సమయంలో సామాజిక వ్యవస్థీకృత ప్రాముఖ్యత' అనే అంశంపై మాట్లాడుతూ మానవ అవసరాలే కొత్త ఆవిష్కరణలకు మూలమని, మనసుంటే మార్గం ఉంటుందని కనుక విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల దృష్టిపెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు సామాజిక వ్యవస్థీకృత వైపు అడుగులు వేయాలన్నారు. వ్యక్తిగత లాభాలకన్నా సమాజ శ్రేయస్సు ముఖ్యమని, సమాజం మేలు కోసం తీసుకువచ్చే ఉత్పత్తులే ఉన్నతస్థాయికి వెళ్తాయని అంటూ అలాంటి ఉద్దేశంతోనే శాంతా బయోటెక్నాలజీ ఏర్పడిందని చెప్పారు. వ్యాక్సిన్ అనేది సుదీర్ఘ ప్రక్రియ అని, శాంతా బయోటెక్ మంచి బృందాన్ని ఏర్పాటుచేసుకుని అనేక రకాల టీకాలను అతి తక్కువ సమయంలోనే ప్రజలకు అందించగలిగిందని తెలిపారు. మనదేశంలో మేధోసంపత్తికేమీ కొదవ లేదని, అయితే సరైన మౌలిక వసతులు, ప్రభుత్వ విధానాలు మంచిగా లేకపోవడం వల్ల అనేకమంది మేధావులు విదేశాలకు వెళ్ళి అక్కడే అభివృద్ధికి తోడ్పడుతున్నారని అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో మన కంటూ ప్రత్యేకస్థానం సాధించుకోవాలంటే అందరూ వినూత్నంగా ఆలోచించి మంచి ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆయన విద్యార్థులకు సూచించారు. వివిఎస్‌యు వీసీ ఆచార్య ఆర్ సుదర్శనరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వివిఎస్‌యు రెక్టార్ ఆచార్య ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ డా. ఎల్‌వి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య సుజాయస్ నాయర్, పీజీసెంటర్ స్పెషల్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో రక్తదానం

తలసేమియా వ్యాధితో బాధలుపడుతున్న చిన్నారులు, కేన్సర్ రోగుల కోసం దాదాపు 80మంది రక్తదాతలు నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. భారతరత్న అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న మహాయాగ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ రక్తనిధిలో నిల్వలు తక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు పురాణం లోకేష్, సభ్యులు పాల్గొన్నారు.



## చాముండేశ్వరి అమ్మవారి సేవలో ప్రసన్న

**- కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు**

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తమ ఇష్టదైవమైన గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో విశేషపూజలు, చండీహోమం తదితర విశిష్టమైన కార్యక్రమాలు చేయిస్తూ అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకుంటున్నారు. ఈనెల 7న తమ కుటుంబసభ్యులతో సహా అమ్మవారి సన్నిధికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయాన్ని ఎమ్మెల్యే ప్రసన్న ఎన్నోసార్లు దర్శించుకున్నారు. ఆలయానికి అవసరమైన అభివృద్ధి పనులన్నిటినీ దగ్గరుండి చేయిస్తున్నాడు కూడా. ఇటీవల ఈ ఆలయంలో తన సొంత నిధులతో శివలింగం, పంచముఖ విఘ్నేశ్వరుడు, షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 48 రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 7న ఎమ్మెల్యే తమ కుటుంబసభ్యులతో కలసి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆలయప్రాంగణంలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రసన్నతో పాటు ఆయన సతీమణి గీతారెడ్డి, కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి, కోడలు పూజారెడ్డి, సోదరులు రాజేంద్రకుమార్‌రెడ్డి, జగదీష్‌కుమార్ రెడ్డి తదితరులు ఈ పూజల్లో పాల్గొన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైకాపా బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, ఆలయ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహాకమిటీ ఛైర్మెన్ నిరంజన్ బాబురెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు జనార్దన్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, రామచంద్రనాయుడు, ఫణీంద్రనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, రాధాకృష్ణారెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పెను గండాలుగా మారుతున్న.. వాయుగుండాలు

***జిల్లాకు ఒకటెనక ఒకటిగా రెండు తుఫాన్లు వచ్చి ప్రజలను అల్లాడించాయి. ఇది చాలవన్నట్లు మూడో తుఫాన్‌గా 'ఆర్నాబ్' తుఫాన్ కూడా సిద్ధమవుతోందని, ఇప్పటికే అది బంగాళాఖాతంలో సుళ్ళు తిరుగుతోందని, తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ వారు చెప్తున్నారు. ఇప్పటికే నివర్, బురేవి తుఫాన్ల ప్రభావంతో గత కొద్దిరోజులుగా జిల్లా అంతటా కురుస్తున్న వానలతో వేలాది ఎకరాల్లో పంటపొలాలు మునిగిపోయి రైతులు విలవిల్లాడుతున్నారు. నివర్ నష్టం 300 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ నష్టానికే కోలుకోలేకుంటే ఇప్పుడు బురేవి తుఫాన్ దెబ్బతో రైతులు మరింతగా నష్టాల పాలయ్యారు. ఇవి చాలవన్నట్లు మళ్ళీ 'ఆర్నాబ్' తుఫాన్ అని, 'టకేటి' పేరుతో ఇంకో తుఫాన్ కూడా వస్తుందని అంటున్నారు. జిల్లాకు ఇలా వరుస గండాలుగా మారుతున్న.. ఈ తుఫాన్లు..వాయుగుండాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు.***

- **భారీ వానలతో.. జిల్లాను నీటముంచిన తుఫాన్లు**
- **పొలాలు, రోడ్లు అన్నీ ధ్వంసం**
- **జనజీవనం అస్తవ్యస్తం**

**ఇవి నాట్లు కాదు... పాట్లు**



వరినాట్లతో తమ పాట్లను తెలియజేస్తున్న కలువాయి మండలం కనుపూరుపల్లి మహిళలు



వానలు వరదలతో జిల్లా అంతా అల్లకల్లోలంగా ఉంది. నివర్ అని, బురేవి అని వచ్చిన తుఫాన్ల ప్రభావంతో జిల్లా అంతా భారీ వానలతో తడిసి ముద్దయింది. పెన్నానది వరదనీటి ఉధృతితో సముద్రాన్ని తలపిస్తోంది. జిల్లాలోని సోమశిల, కండలేరు, గండిపాళెం జలాశయాలు నిండా నీటితో నిండుకుండల్లా ఉన్నాయి. నదులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వానలు కాసేపు తెరపిచ్చినట్లు కనిపించినా మళ్ళీ రాత్రీ పగలు కురుస్తూనే ఉన్నాయి. ఈనెల 4 నుంచి 7వ తేదీ దాకా జిల్లాలో వానలు దంచికొట్టాయి. అయితే ఈ వానలు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. వర్షాలు ఇంకా ఎక్కువైతే మరింత ప్రమాదం జరుగుతుందేమోనని అందరూ భయపడుతున్నారు. ఇప్పటికే బురేవి దెబ్బతో జిల్లాలో రోడ్లన్నీ దెబ్బతిని బురద మిగిలింది. దీని తర్వాత మళ్ళీ ఆర్నాబ్ వస్తుందట. అదెంత నష్టం మిగిలిస్తుందో చెప్పలేం. ఈ వరుస తుఫాన్లు జిల్లాను అదరగొట్టేట్టున్నాయి. బురేవి తుఫాన్ దెబ్బకు జిల్లా అంతా వణికిపోయింది. ఈనెల 6, 7తేదీల్లో ఆగి ఆగి వాన కురుస్తూనే ఉంది. అనేకచోట్ల వాగులు పొంగి రోడ్లమీద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక గ్రామాలు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు గోడుగోడుమంటున్నారు. ఆక్వా రంగానికి, మత్స్య పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టం వచ్చింది. ఇళ్ళలోకి నీళ్ళు రావడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం.

### గుంతలుగా మారిన రోడ్లు

జిల్లాలోని రోడ్లన్నీ ఈ భారీవానల ధాటికి భారీగానే దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా గుంతల మయమే. జిల్లాలో ఏ గ్రామం చూసినా బురదమయమే. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో మురుగు గబ్బుతో నిండిన వీధులే. పరిశుభ్రత అన్నదే కనిపించని దుస్థితి ఏర్పడింది పల్లెల్లో. అధికారులు ఎన్నిసార్లు పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టినా సరైన పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోతుండడంతో పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తోంది. గ్రామాల్లో ఏరోజుకారోజు చెత్తను ఎత్తివేసేందుకు తగు ఏర్పాట్లు లేకపోవడంతో చెత్తంతా రోజుల తరబడి పేరుకుపోతూనే ఉంది.



### మురుగు గబ్బులో నగరం :

అసలే అధ్వాన్నంగా ఉన్న నెల్లూరు నగర డ్రైనేజీ వ్యవస్థ ఈ రెండు తుఫాన్లు, భారీ వానల దెబ్బకి మరింత కకావికలమైపోయింది. ఎక్కడ చూసినా సైడు కాలువల పొంగి ప్రవహిస్తుండడంతో రోడ్లు మురుగు కాలువలయ్యాయి. నగరంలోని ప్రధాన రోడ్లమీద నడుస్తున్నా సరే..మురుగు కాలువల్లో నడిచినట్లే ఉంటోంది ప్రజలకి. ఈ డ్రైనేజీ వ్యవస్థ ఇంకా ఎంతకాలానికి బాగుపడుతుందో ఆ దేవుడికే తెలియాలి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం నిండిపోయి, సైడు కాలువలు పొంగిపోయి పరమ దుర్గంధంగా ఉండే మురుగునీటితో కలసి వాననీరు రోడ్ల మీద మడుగులు కట్టడంతో ప్రజలు ఆ దుర్వాసన భరించలేక నానా అవస్థలు పడ్డారు.

### బురేవీ తర్వాత ఆర్నాబ్

జిల్లాకు మరో తుఫాన్ పొంచి ఉందని, దానికి 'ఆర్నాబ్' అని పేరు పెట్టారని, దీని ప్రభావంతో ఇంకోరెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో జిల్లా రైతులు ఇదెక్కడి తుఫాన్ల బాధ బాబోయ్ అంటూ ఆందోళన చెందుతున్నారు.



# ఓం!.. నమ: శివాయ!

- కార్తీక దీపకాంతులతో కళకళలాడిన ఆలయాలు
- పార్వతీ పరమేశ్వరులకు పెద్దఎత్తున పూజలు, సేవలు

కార్తీకమాసం నాల్గవ సోమవారం రోజైన ఈనెల 7న జిల్లావ్యాప్తంగా శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. 'ఓం నమ: శివాయ', హర హర మహాదేవ.. అంటూ భక్తులు పెద్దపెట్టున చేసిన శివ నామ స్మరణలతో ఆలయాలు మార్మోగాయి. శివ పంచాక్షరి జపిస్తూ పెద్దఎత్తున భక్తులు భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను నిర్వాహకులు ఎంతో సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. మరోవైపు ఆలయాల ప్రాంగణాలు కార్తీక దీపకాంతులతో దేదీప్యమానమయ్యాయి. కార్తీక సోమవారం పరమశివునికి ప్రీతిపాత్రమైనది కావడం, ఇదెంతో పుణ్యప్రదమైన రోజు కావడంతో పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు విచ్చేసి ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలైన జొన్నవాడలోని కామాక్షి తాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో విశేష పూజలు, సేవలు జరిగాయి. అదేవిధంగా సోమశిలలోని సోమేశ్వరాలయం, రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వరాలయం, సిద్ధలయ్యకోనలోనూ స్వామివార్లకు శోభాయమానంగా అలంకరణలు చేసి విశిష్ట పూజలు చేశారు. కార్తీక దీపాల వెలుగులతో ఆలయాలన్నీ కళకళలాడాయి.

### నగరానికి కార్తీక శోభ :

నెల్లూరు నగరంలోనూ ఆలయాలు కార్తీక దీప కాంతులతో శోభాయమానమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు క్రిక్కిరిసిపోయాయి. మహిళా భక్తులు అనేక ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో స్వామివార్లకు పుష్పాలంకరణ, వేడుకగా ప్రాకారోత్సవం నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వర



స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మద్రాసు బస్టాండ్ దగ్గర్లో ఉన్న ఉమా మహేశ్వరాలయం, ములుముడి బస్టాండ్ వద్ద ఉన్న భ్రమరాంబాదేవి సమేత శ్రీ హరిహరనాధాలయం, వేదాయపాళెంలోని కామాక్షిదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం, మూలాపేటలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం, నవాబుపేటలోని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో 1008 మృత్తికా శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, తులసి పూజ నిర్వహించారు. పరమశివునికి అభిషేకం చేస్తున్నట్లుగా ఇక్కడ ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.

## అదృశ్యం

- చిన్ని నారాయణరావు
94402 02942



గుండెలపై
వింటి నారి సంధించినప్పటి
సడి చేయలేని బాధ
హృదయ కుహరాన్ని తొలుచుకుంటూ
మరణం రక్తసిక్తం చేస్తున్న దృశ్యం
ఈరోజుటికి మనిషై
రేపటికి ఎగిరే గాలిపటమై
చుక్కలను తాకినప్పటి సవ్వడి
క్షణకాలంలో మనిషిని చాకచక్యంగా
భూకక్ష్య నుంచి తప్పించే
కొత్త రాత విధాత సృష్టించిన విధానం
మనసంతా కకావికలం -
చావు మనిషికి లంగరేసే ఉండడం
సహజమే
అనంతలోకాల్ని దాటించి క్షణంలో మాయం చేస్తే
మనసు తుఫాన్ నాటి కల్లోల సంద్రం కాదా!
ఘనాపాటీలయిన వాళ్ళు
తృటిలో అంతర్ధానమైతే
మనసు నిప్పురవ్వై దహించి వేయదా
మరణం అవిశ్రాంతంగా సాగేచోట
కన్నీటి కడలికి ఎదురీది ఎలా నిలబడగల్గాలి
జ్ఞాపకాల్లోకి జారిన మనసు
దగ్ధమవుతున్న కలల్ని ఎలా భరిస్తుంది.
కాలం కదలికలన్నీ మృత్యువునే సరఫరా చేస్తుంటే
కాలాన్ని నమ్మడమెలా?
క్షణంలో బ్రతుకు ఉద్విగ్న సుడిగుండమైతే
ఏమని వీడ్కోలు చెప్పను
బాధామయ గాథల్ని పొదివి పట్టుకొని
మరణం తీరం తాకక తప్పదు
జీవిక బ్రతుకు చొక్కాను వదిలేసి
కొత్త చొక్కా ధరించకా తప్పదు!

# గూడూరు డివిజన్ వార్తలు

## సచివాలయాల ద్వారానే పథకాలు

- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ



రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ సచివాలయ వ్యవస్థ ద్వారానే ప్రజలకు చేరాలి కనుక సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉండాలని గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. ఇటీవల ఆయన గూడూరు పట్టణంలోని సత్రపువీధి, గాంధీనగర్‌లోని సచివాలయాలను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న రైస్‌కార్డుల గురించి సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కార్డుల్లో కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లడం, కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండడం తదితర కారణాలతో కార్డులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. కార్డు పెండింగ్ సమస్యలను తొందర్లో పరిష్కారమయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. సచివాలయాల్లో రిజిస్టర్, అందించిన పథకాల నమోదు సరిగా చేయాలని సిబ్బందికి సూచిస్తూ.. కొందరు సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని హెచ్చరించారు.



## జనం గోడు పట్టని ఎమ్మెల్యే

### గూడూరు-తిప్పవరప్పాడు వాహనదారుల అసంతృప్తి

ఎమ్మెల్యే గారూ మీరెక్కడున్నారంటూ అనేకమంది వాహనదారులు గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును పదేపదే తలచుకుంటూ ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గూడూరు-తిప్పవరప్పాడు రోడ్డు మోకాటి లోతు గుంటలతో ఉన్నా పట్టించుకోని ఎమ్మెల్యే వైఖరిని వారు దుయ్యబట్టారు. ఈ భారీ వానల దెబ్బకు ఈ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా తయారై వాహనదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉన్నా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అయ్యా ఎమ్మెల్యేగారూ!.. ఒక్కసారైనా ఇటువైపుకు వచ్చి ఈ రోడ్డులో ప్రయాణించి మా అవస్థలు తీర్చండంటూ నిత్యం వాహనదారులు కోరుకుంటూనే ఉన్నారు.

## అంబేద్కర్ దయవల్లే ఎమ్మెల్యేనయ్యా


— మాజీఎమ్మెల్యే పాశం సునీల్



భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్.అంబేద్కర్ దయవల్లే తాను ఎమ్మెల్యే కాగలిగానని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ పనిచేయాలని మాజీ శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ 64వ వర్ధంతి గూడూరు అశోక్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద అంబేద్కర్ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఆయన విగ్రహానికి పాశం సునీల్‌కుమార్, వేగూరు రాజేంద్రప్రసాద్, డాక్టర్ చంద్రహాస్, మండ్ల సురేష్, చంద్ర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ అందరూ చదువుకుని విద్యావంతులు కావాలని, రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. చిల్లకూరు శ్రీను, మహిధర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇవ్వండి సారూ!...

- ఆదిశంకర విద్యాసంస్థల టీచర్లు డిమాండ్




గత సంవత్సర కాలంగా ఆదిశంకర యాజమాన్యం తమకు జీతాలు చెల్లించకుండా.. కాలయాపన చేస్తున్నారంటూ ఆదిశంకర పాఠశాల ప్రైవేటు ఉపాధ్యాయులు, ఎబివిపి నాయకులు ఇటీవల ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ లెక్చరర్స్ మరియు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోగినేనిపురం ఆదిశంకర స్కూల్ వద్ద ఈ ధర్నా చేపట్టారు. కరోనా వచ్చి నప్పటి నుండి మా కుటుంబాలు అగమ్యగోచరంగా తయారయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాయుడుపేటలోని ఆదిశంకర పాఠశాలలో కూడా ఇలానే జీతాలు ఇవ్వకుండా అక్కడి ఉపాధ్యాయులను కూడా మోసం చేశారని, తమకు రావాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల సహకారంతో యాజమాన్యానికి తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు.

## పాన్‌షాపులపై దాడులు



స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్.పి మరియు అసిస్టెంట్ కమిషనర్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో వారి ఆదేశాలతో గూడూరు ఎస్.ఇ.బి ఇన్‌ఛార్జ్ సి.ఐ ఆరేటి శ్రీనివాసరావు ఈ నెల 6వ తేదీ గూడూరులో ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తుల (పాన్ పరాగ్) అక్రమ నిల్వకు నిలయాలైన కూల్‌డ్రింక్ షాపులు, పాన్‌షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దగ్గర 56 పాన్‌పరాగ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో సి.ఐ వెంట తన సిబ్బంది సూరినారాయణ, మల్లిఖార్జున, నారాయణ, దయాకర్ ఉన్నారు.



ఈ నెల 6వ తేదీ డా. బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని గూడూరు ప్రభుత్వాసుపత్రిలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై, అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గూడూరు పట్టణ సి.ఐ దశరథరామయ్య

### కాశీ విశ్వేశ్వరునికి..

## కమలానంద భారతి పూజలు

కార్తీకమాసం సందర్భంగా ఆత్మకూరులోని అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో ఈనెల 6న అమృతాశ్రమ నిర్వాహకులు కమలానంద భారతిస్వామి ప్రత్యేక పూజలు చేయడంతో ప్రజల్లో ఆనందం వెల్లువెత్తింది. శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ఆయన విశేష అలంకరణలు చేసి, మహాశివలింగాన్ని పంచామృతాలతో అభిషేకించారు. ఆ తర్వాత భక్తులతో కూడా అభిషేకాలు చేయించారు. మహిళలు ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య, అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ సారధ్యంలో కార్తీక దామోదర పూజ చేశారు. ఆ తర్వాత కార్తీక వనభోజనాలు నిర్వహించారు. సీమబ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణమాచార్యులు, పి.మోహన్‌రావు, చక్రవర్తి, ఉషారాణి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆ కళాకారుల మృతి బాధాకరం

కావలిలో విశ్వవినోదం హాస్య సేవాసంస్థ వ్యవస్థాపకుడు సర్వాభొట్ల వెంకటశేషయ్య, ప్రముఖ జానపద గాయకుడు కె.ఎం కుమార్‌ల అకాలమృతి బాధాకరమని, వీరి మృతి కావలి కళారంగానికి తీరని లోటని పలు సంఘాల వారు విచారం వ్యక్తం చేశారు. ఈనెల 6న కావలిలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంస్మరణ సభలో పలువురు వక్తలు పాల్గొని మృతి చెందిన ఆ ఇద్దరు కళాకారులకు నివాళులర్పించారు. కళారంజని వ్యవస్థాపకుడు కుందుర్తి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు ప్రతాప్‌రెడ్డి, కళాసమితి కార్యదర్శి బివి లక్ష్మీనారాయణ, రవిప్రకాష్, నల్లూరి రామకృష్ణ, కెవిఎస్‌వి ప్రసాద్, కాళిదాసు, విజయ్‌చంద్ర, వ్యాసం కృష్ణమూర్తిలతో పాటు సిపిఎం నాయకుడు మాల్యాద్రి, సిఐటియు నాయకుడు జాన్ తదితరులు పాల్గొని కళారంగానికి ఆ కళాకారులు చేసిన సేవలను కొనియాడారు.

## బిజెపితోనే..రాష్ట్రానికి దశ-దిశ

**- సునీల్ దియోధర్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశ-దిశ బిజెపితోనే సాధ్యమవుతుందని బిజెపి రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్ అన్నాడు. ఈనెల 6న వెంకటగిరిలో జరిగిన బిజెపి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపిని బలోపేతం చేసేందుకు అందరూ కృషిచేయాలన్నాడు. కేంద్రప్రభుత్వం పేదల సంక్షేమానికి ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటూ సోకులు పోతోందని విమర్శించాడు. వైకాపా-టిడిపిలు రెండూ కుటుంబపార్టీలుగా మారాయని, వీరి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టాడు. రానున్న తిరుపతి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని బలోపేతం చేయాలన్నాడు. బిజెపి నాయకులు దయాకర్‌రెడ్డి, ఉమా, చంద్రశేఖర్‌రెడ్డి, రంగినేని కృష్ణయ్య, ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, చంద్రమోహన్‌రావు, భాస్కర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### బాధితులకు

## అండగా ప్రభుత్వం

**- సర్వజ్ఞకుమార యాచేంద్ర**

తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, ప్రతి ఒక్కరిని కష్టాల నుంచి ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెంకటగిరి యువరాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర చెప్పారు.

ఈనెల 6న ఆయన వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీలో తుఫాన్ బాధితులను పరామర్శించారు. తుఫాన్ వల్ల కలిగిన నష్టాలను ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారని, బాధితులందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. బాధితులను ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తున్నామని, వెంకటగిరి ప్రజలకు ఎల్లప్పుడూ తమవంతు సహాయ సహకారాలుంటాయని ఆయన చెప్పారు.

### ఐటిఐలో చేరేందుకు

## దరఖాస్తులు పంపండి

పొదలకూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ ఈనెల 6న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూయింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 12వ తేదిలోగా దరఖాస్తులు పంపాలని, అభ్యర్థులకు ఈనెల 15వ తేది ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు చేస్తామని తెలిపారు.

### ఉపాధి పనులకు

## ప్రతిపాదనలు సిద్ధం

జిల్లాలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో సుమారు 4వందల కోట్ల రూపాయల నిధులతో ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని డ్వామా పీడీ తిరుపతియ్య ఈ నెల 8న తెలిపారు. అదేవిధంగా నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో 15కోట్ల వంతున నిధులు కేటాయించామని చెప్పాడు.

## శబరిమలై వెళ్లొచ్చిన... నీళ్ళ మంత్రి



మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ ఈనెల 6న బయలుదేరి శబరిమలై వెళ్లారు. మళ్ళీ 8వ తేదీన తిరిగి నెల్లూరు చేరుకున్నాడు. ఆయనతో పాటు పలువురు అయ్యప్ప భక్తులు వెళ్లొచ్చారు.

## జగన్ పాలనలో పుష్కలంగా వర్షాలు

**- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పుష్కలంగా వానలు కురుస్తూ రైతులు సుభిక్షంగా ఉన్నారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. భారీవర్షాలతో గండిపాళెం జలాశయానికి పుష్కలంగా నీళ్ళు వచ్చిన ఆనందంతో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక రైతులు అందరూ కలసి ఈనెల 6న జలాశయం వద్దకు వచ్చి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ తర్వాత గండిపాళెం జలాశయానికి నిండా నీళ్ళు రావడంతో రైతులు సంతోషిస్తున్నారని అన్నాడు. దివంగత నేత వైయస్సార్ హయాంలో ఈ ప్రాజెక్టులో అయిదేళ్ళపాటు పుష్కలంగా నీళ్ళు ఉండేవని, దాదాపు పదకొండేళ్ళ తర్వాత ఇప్పుడు ఆయన తనయుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఈ జలాశయానికి నిండా నీళ్ళు వచ్చాయని అన్నాడు. మరో రెండేళ్ళలో వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బీడు భూములు సాగులోకి వస్తాయని, ముఖ్యమంత్రి, మంత్రి, కలెక్టర్‌లతో మాట్లాడి జలాశయం అభివృద్ధికి కృషి చేస్తామన్నాడు. నీటిపారుదల శాఖ డి.ఇ రవి, ఏఎంసి ఛైర్మెన్ ఆలీఅహ్మద్, వైకాపా నాయకులు భాస్కర్‌రెడ్డి, మూలె సుబ్బారెడ్డి, వినయరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వసిద్ధి ప్రదాయకుడు..పొదలకూరు వినాయకుడు

***స**కల విఘ్న వినాశకుడుగా.. సర్వ సిద్ధి ప్రదాయకుడుగా, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వేలుపుగా ప్రసిద్ధి చెందిన వినాయకునికి నెల్లూరుజిల్లాలోని మండల కేంద్రమైన పొదలకూరులో అత్యద్భుతమైన ఆలయం ఉంది. ఎంతోకాలం క్రితం స్వయంభువుగా ఇక్కడ వెలసిన గణపయ్యకు రాష్ట్రంలోనే అరుదైనవిధంగా తొమ్మిదడుగుల మహాగణపతి విగ్రహాన్ని రూపుదిద్దడం విశేషం. సత్యప్రమాణాలకు నెలవుగా ఉన్న ఈ ఆలయానికి ఆసక్తికరమైన స్థలపురాణం కూడా ఉంది.*

దక్షిణ భారతదేశంలోనే పురాతనమైన విఘ్నేశ్వరాలయం.. పొదలకూరులో ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టం. ఈ ఆలయం సుమారు మూడు వందల సంవత్సరాల క్రితమే నిర్మితమైనట్లు చరిత్ర. ఈ ఆలయ ప్రాంగణంలోనే పురాతన కాలం నుంచి కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరాలయం కూడా ఉంది. భక్తులు తొలుత రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత విఘ్నేశ్వరుని దర్శించుకోవడం ఆనవాయితీ. చోళరాజులు, విజయనగర రాజుల ఆలయనిర్మాణ శైలిగల రాతిస్తంభాలు, శిల్పాలు ఈ ఆలయంలో ఉండడంతో నాటి రాజుల కాలం లోనూ ఈ ఆలయం ఒక వెలుగు వెలిగినట్లు తెలుస్తోంది.





### మన దేవాలయాలు 24

### ఆలయ చరిత్ర :

ఈ మహాగణపతి ఆలయం ఆవిర్భావానికి సంబంధించి విశేషమైన స్థల పురాణం ఒకటి ప్రచారంలో ఉంది. ఒకప్పట్లో ఇక్కడున్న శ్రీ రామలింగేశ్వరాలయం పూర్వభాగంలో సువిశాలమైన ఖాళీస్థలం ఉండేది. అక్కడ అనేకరకాల వృక్షాలు ఉండేవి. అప్పుడు ఇదంతా అటవీ ప్రాంతం కావడం, దారి మధ్యలో క్రూరమృగాలు, బందిపోట్ల బెడద ఉండడంతో వర్తకులు అనేకమంది మార్గమధ్యంలో ఉన్న పొదలకూరుకు వచ్చి ఇక్కడున్న చెట్ల కింద సేదతీరేవారు. ఈ నేపథ్యంలో ఒక దూది వర్తకుడు దూదినంతా బండ్లకెత్తి ఒకరాత్రి ఇక్కడకు వచ్చి బసచేశాడు. అప్పుడు ఆ వర్తకునికి విఘ్నేశ్వరుడు స్వప్నంలో కనిపించి తానొక దూది బస్తాలో ఉన్నానని, తనకు ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని చెప్పడం, తెల్లారేసరికల్లా బస్తాల్లో ఉన్న దూది అంతా చెదలు పట్టినట్లుగా కనిపించడంతో, చెడిపోయిన దూదినంతా వేరుచేసి మంచి దూదిని మాత్రమే తీస్తుండగా ఒక బస్తాలో విఘ్నేశ్వరుని ఆకారంలో పుట్ట లాంటిది ఒకటి కన్పించడం జరిగాయట. ఆ రూపాన్ని ఆ వర్తకుడు రామలింగేశ్వరాలయంలో భద్రపరచి మిగిలిన దూదిని తీసుకువెళ్ళి ఇతర ప్రాంతాల్లో విక్రయించగా విపరీతమైన లాభాలు రావడంతో అదంతా ఆ విఘ్నేశ్వరుని మహిమేనని గ్రహించి, తిరుగు ప్రయాణంలో పొదలకూరుకు వచ్చి స్వామివారికి ఈ అత్యద్భుతమైన ఆలయం నిర్మించినట్లు చెప్తుంటారు. ఇక్కడ విఘ్నేశ్వరుడు దక్షిణాభిముఖంగా, తొమ్మిదడుగుల ఎత్తుతో భారీ విగ్రహంగా ప్రతిష్ఠించబడి ఉంటాడు. ఆలయంలోకి కూడా దక్షిణ దిశ ద్వారానే వెళ్ళాల్సి ఉంటుంది. కాలక్రమంలో ఈ ఆలయం జీర్ణావస్తకు చేరుకుంది. ఆ తర్వాత కాలంలో మాన్యాలుండి ఆస్తులున్నా ఆదాయం లేకపోవడంతో ఆలయ నిర్వహణ కష్టమైందని, ఆ దశలో పొదలకూరులోని వైశ్యప్రముఖుడు, స్వామివారి భక్తుడైన కీర్తిశేషులు ఆకులూరు రాఘవులు శ్రేష్టితో పాటు పొదలకూరులోని ప్రముఖులు, ప్రజలు అనేక మంది భక్తులంతా కలసి దాతల విరాళాలతో ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం తెప్పించారని అంటారు.

### 1980 ప్రాంతాల్లో కంచిస్వామి పూజలు

1980 ప్రాంతాల్లో కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ జయేంద్రసరస్వతి స్వామీజీ వారు శ్రీ రామలింగేశ్వరాలయంలో మహాకుంభాభిషేకం సందర్భంగా ఇక్కడికి వచ్చినప్పుడు మహాగణపతి ఆలయాన్ని కూడా దర్శించి ఈ ఆలయం సుమారు 300 ఏళ్ళ క్రితం నాటిదని చెప్తూ స్వామి వారికి విశిష్టమైన పూజలు చేసి మంత్రపూర్వకమైన యంత్రాలు ప్రతిష్టించారని, అప్పటినుంచి ఈ ఆలయానికి మరింత వెలుగు వచ్చిందని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రాంతాల్లో ని ప్రజలు ఎవరు ఏ కార్యక్రమం తలపెట్టినా తొలుత ఈ ఆలయానికి వచ్చి మహాగణపతిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఇప్పటికీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేకమంది తమ సత్యప్రమాణాల నిరూపణకు ఈ ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేస్తుంటారు. ఎంతటి కష్టాల్లో ఉన్నా సరే, ఇక్కడి విఘ్నేశ్వరుని పూజిస్తే ఆ కష్టాలన్నీ మటుమాయమవుతాయని భక్తుల విశ్వాసం.

# ఆగ్రహించిన 'అన్నదాత'

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ-హర్యానా సరిహద్దుల్లో ఆందోళనకారుల్లో ఉద్రిక్తత కనిపించడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సింఘూ సరిహద్దుల్లో వేలాదిమంది రైతులు బంద్‌లో పాల్గొన్నారు. ఉత్తర భారతదేశంలో బంద్ ప్రభావం తీవ్రంగా కనిపించింది. రైతుల ఆందోళనకు ప్రధాన కేంద్రంగా ఉన్న పంజాబ్‌లో రైతులు కదం తొక్కారు. హర్యానా, పంజాబ్ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు వాహనాల్లో తరలిరావడంతో పలుచోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. పశ్చిమ బెంగాల్, బీహార్, హర్యానా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కేరళ, తమిళనాడు, ఒడిస్సా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో బంద్‌కు మద్దతుగా భారీ ర్యాలీలు, ఆందోళనలు చేశారు. దేశవ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. అనేక ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జనజీవనం స్తంభించింది. కొన్ని చోట్ల రోడ్లపై రైతులు బైఠాయించి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలోనూ బంద్ ప్రశాంతంగా జరిగింది. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, కార్మిక కర్షక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు కొనసాగాయి. మొత్తమ్మీద అన్నదాతలకు దేశవ్యాప్తంగా భారీ మద్దతు లభించింది. రైతు సంఘాల విజ్ఞప్తుల మేరకు ఎక్కడికక్కడ దుకాణాలను, వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు. వేలాదిమంది ఉద్యోగులు రైతులకు మద్దతుగా సామూహికంగా సెలవులు పెట్టారు. భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు లభించిందని, దీన్నిబట్టి రైతుల కోర్కెలు ఎంత న్యాయమైనవో తేటతెల్లమైందని రైతునాయకులు పెద్దఎత్తున ప్రసంగాలు చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుని రైతులకు ప్రయోజనకరమైన విధానాలతో చట్టాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

### ఆంధ్ర, తెలంగాణల్లో...

ఆంధ్రప్రదేశ్‌లోనూ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో వైఎస్సార్సీపి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ సంఘీభావం తెలపడంతో మధ్యాహ్నం 1గంట వరకు ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ఆర్టీసి బస్సులు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతులకు మద్దతుగా ర్యాలీలు, ధర్నాలు జరిగాయి. వామపక్షాలతో కలిసి రైతు సంఘాలు, కార్మికసంఘాలు రోడ్డెక్కి నిరసనలు తెలిపాయి. అదేవిధంగా తెలంగాణలోనూ అధికారంలోఉన్న కెసిఆర్ ప్రభుత్వం అన్నదాతలకు మద్దతు పలికింది. అన్నదాతల ప్రయోజనాలు దెబ్బతీసేవిధంగా ఉన్న సాగు చట్టాలు రద్దుచేయాలంటూ భారత్‌బంద్‌లో పాల్గొని పెద్దఎత్తున రైతులు ఆందోళనలు చేశారు. టిఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, రైతుసంఘాలు ఈ ఆందోళనల్లో పాల్గొన్నాయి.

### రైతులకు మద్దతుగా జిల్లాలో ర్యాలీలు.. బైఠాయింపులు :

నెల్లూరుజిల్లాలో కూడా బంద్ ప్రశాంతంగా జరిగింది. అన్నదాతలకు బాసటగా రాజకీయపార్టీలు, విపక్షాల ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులు, రైతుసంఘాల వారు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. పట్టణాలు, గ్రామాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. వామపక్ష పార్టీల వారు పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతపట్టి రోడ్డెక్కారు. కొన్నిచోట్ల రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టారు. రైతుల వెన్ను విరిచే చట్టాలను రద్దుచేయాలంటూ కేంద్రాన్ని కోరుతూ నినాదాలు చేశారు. విద్యాసంస్థలు మూసివేయడం, ప్రభుత్వాఫీసులు మధ్యాహ్నం దాకా తెరవకపోవడం, ఆర్టీసి బస్సులను సగానికి సగం నిలిపివేయడంతో జిల్లాలో బంద్ వాతావరణం కనిపించింది. కాంగ్రెస్‌పార్టీ వారు, వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు, రైతుసంఘాల వారు బంద్‌లో పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు. కొన్నిచోట్ల టిడిపి, తెలుగుయువత ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ వద్ద వామపక్షాలు, కాంగ్రెస్‌తో పాటు పలు ప్రజాసంఘాలు కలిసి పెద్దఎత్తున నిరసనలు తెలుపుతూ ఆందోళనలు నిర్వహించారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం కలిగించని ఆ మూడు రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దుచేయాలని నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాల వల్ల ధరలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని అయ్యప్ప గుడి, వెంకటేశ్వరపురం కూడలి, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై సిపిఎం, సిపిఐ నాయకులు, రైతుసంఘాల వారు బైఠాయించి ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. టిఎన్ఎస్ఎఫ్, విద్యార్థి జెఏసి ఆధ్వర్యంలో విఆర్‌సి సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. నగరంలో కాంగ్రెస్, సిపిఎం, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించారు. బంద్ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

## కాలధర్మం

### చిత్తలూరు సీతారామిరెడ్డి



వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన చిత్తలూరు సీతారామిరెడ్డి తన 80వ ఏట డిసెంబర్ 7వ తేదీ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నాడు. ఆయనకు భార్య ప్రమీలమ్మ, కుమారులు చంద్ర, హరి ఉన్నారు. కుమారులిద్దరూ అమెరికాలో స్థిరపడినా సీతారామిరెడ్డి దంపతులు మాత్రం జన్మభూమిపై మమకారంతో నెల్లూరులోనే ఉండిపోయారు. సీతయ్యగా తన సహచర మిత్రులకు సుపరిచితమైన ఆయన స్వగ్రామం దగదర్తి మండలం ఉప్పలపాడు. ఆయన బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగింది. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ పట్టభద్రుడై, ప్రభుత్వ ఉద్యోగిగా వ్యవసాయ శాఖలో వివిధ హోదాలలో పనిచేసి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశాడు. సీతయ్య మృదుస్వభావి, ఎవరు కనిపించినా ఎప్పుడూ నవ్వుతూ పలకరించేవాడు. వ్యవసాయ శాఖలో కూడా నిబద్ధత కలిగిన అధికారిగా ఆయనకు మంచి పేరుండేది. ఎవరినీ నొప్పించేతత్వం కాదు ఆయనది. ఆయనకు 1965లో ప్రమీలమ్మతో వివాహం జరిగింది, ప్రమీలమ్మ కూడా బోటనీ లెక్చరర్‌గా నెల్లూరు కెఏసి కళాశాలలో పనిచేసి రిటైర్ అయ్యారు.

నెల్లూరులోని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రఘురామిరెడ్డి, అశ్విని లేబొరేటరీ అధినేత డాక్టర్ రాజగోపాలరెడ్డిలకి సీతారామిరెడ్డి షడ్డకుడే. కుటుంబ పెద్దను కోల్పోయి శోక సముద్రంలో ఉన్న సీతయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# రైతుల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు

### కాంగ్రెస్, కమ్యూనిస్టులపై బిజెపి నాయకుల ధ్వజం

రైతులకు మేలు చేసేందుకు కేంద్రప్రభుత్వం మంచి చట్టాలు చేస్తుంటే కాంగ్రెస్‌పార్టీ, కమ్యూనిస్టు పార్టీల వాళ్ళు మాత్రం అందుకు వ్యతిరేకిస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారంటూ బిజెపి జిల్లా నాయకుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 7న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రధాని మోడీ కృషిచేస్తుంటే కాంగ్రెస్ మాత్రం పంజాబ్ రైతులను ఢిల్లీకి తరలించి ఆందోళనలు చేయిస్తోందని, రైతును రాజుగా చూడాలని మోడీ కోరుకుంటుంటే రైతులను భిక్షగాళ్ళను చేయాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, ఉయద్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి రాష్ట్ర నాయకులుగా జిల్లా నుండి మరో నలుగురు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నెల్లూరుజిల్లాకు చెందిన మరో నలుగురు నాయకులు ఎంపికయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఈనెల 7న వారి పేర్లు ప్రకటించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న గడ్డం లక్ష్మీనారాయణ, రఘునాథ్ రాజు, డాక్టర్ విజయలక్ష్మి, అనూరాధరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు.

### కన్నుల పండువగా... శ్రీ మూలస్థానేశ్వరుని కల్యాణం

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 6న స్వామివార్ల కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి కల్యాణం నిర్వహించారు. మోదెం సత్యనారాయణగుప్తా, పూర్ణిమ దంపతులు ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో కల్యాణోత్సవం నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులు అనేకమంది ఆలయానికి విచ్చేసి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని తిలకించారు.

### పుస్తక పఠనం విజ్ఞానదాయకం

పుస్తక పఠనం ఎంతో విజ్ఞాన దాయకమని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ పుస్తకాలను అధ్యయనం చేసి మరింతగా విజ్ఞానవంతులు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అన్నారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని కేంద్ర గ్రంథాలయంలో 'ఉయ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మానసిక వికాసానికి, విజ్ఞానానికి గ్రంథాలయాలు ఏ విధంగా దోహదం చేస్తాయో వివరించారు. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, చరిత్ర, ప్రాచీన గ్రంథాలతో పాటు విద్యార్థులకు అవసరమైన ఎన్నో అమూల్యమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంటాయని ఆయన అన్నారు. తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంఓ నాగ మోహన్‌రెడ్డి, సాయి వరప్రసాద్, సతీష్ కుమార్, ప్రసాద్, కృష్ణయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌కో కార్మికుల అక్రమ తొలగింపు అన్యాయం

ట్రాన్స్‌కోలో కొందరు కార్మికులను అక్రమంగా తొలగించారని, ఇదెంతో అన్యాయమని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ కొత్తూరు అంబాపురంలో ఉన్న ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళన నిర్వహించారు. ఆత్మకూరు, వింజమూరు, రాచర్లపాడు ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న 30 మందిని తొలగించడం దారుణమని, ఆ కార్మికులను తిరిగి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు దుగ్గిరాల సూరిబాబు, నాగేశ్వరరావు, జాకీర్‌హుస్సేన్, హరినారాయణ, సిఐటియు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

# తిరుపతిపై.. కన్నేసిన కమలం

(మొదటి పేజీ తరువాయి)

చాలామంది ఊహలు తారుమారు చేస్తూ, ఆ పార్టీ కొత్త పేరును తెరపైకి తెచ్చింది. జగన్ షర్మిలల పాదయాత్రల్లో వారి వెంటేవుంటూ వారికి ఫిజియోథెరఫీ సేవలందించిన వారి వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ గురుమూర్తిని తమ అభ్యర్థిగా పెట్టబోతున్నట్లు పార్టీ పెద్దలు చెప్పారే తప్ప ఇంతవరకూ పార్టీ అధికారికంగా అభ్యర్థిని ప్రకటించలేదు. కానీ గురుమూర్తే తమ అభ్యర్థి అని పార్టీ నేతలు చెప్తున్నారు.

తెలంగాణలోని దుబ్బాకతో పాటు, హైదరాబాద్ మేయర్ ఎన్నికలలో కూడా ఊహించని ఫలితాలను సాధించుకున్న భారతీయ జనతా పార్టీ ఇప్పుడు తిరుపతిపై కన్నేసిందని స్పష్టంగా తెలుస్తోంది. ఆ పార్టీ తమ అభ్యర్థి ఎవరన్నది ఇప్పటివరకు తేల్చకపోయినప్పటికీ ప్రచారాన్ని మాత్రం మొదలుపెట్టి ముమ్మరం చేసింది. రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) బృందం తిరుపతి పట్టణంతో పాటు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అన్ని ప్రాంతాలలో ఇప్పటికే దిగిపోయి మోడీ మార్కు మైండ్ గేమ్‌ని మొదలుపెట్టేసిందని విశ్వసనీయ సమాచారం. వందల సంఖ్యలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక కోసం ఇప్పటినుండే కసరత్తు చేస్తున్నారని వార్త. ఆర్ఎస్ఎస్ ఒకప్పటి ప్రచారక్, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్, 2014లో వారణాసిలో మోడీ విజయానికి, 2018లో త్రిపురలో భారతీయ జనతాపార్టీ విజయఢంకా మోగించడానికి వ్యూహరచన చేసిన సునీల్ దియోధర్ ఏకంగా తిరుపతిలో ఇల్లు తీసుకుని మరీ మకాం వేయడమే కాకుండా తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించడాన్ని గమనిస్తే ఈ వార్తలకు బలం చేకూరుతోంది.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు తోడుగా బిజెపి రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న సునీల్ దియోధర్‌తో పాటు మరికొంతమంది రాష్ట్రస్థాయి నాయకులు కూడా ఇటీవల తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకివచ్చే సూళ్లూరుపేట తదితర ప్రాంతాలలో పర్యటించారు. భాజపాతో దోస్తీ చేస్తున్న పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ కూడా నివర్ తుఫాన్ బాధితుల పరామర్శ పేరుతో తిరుపతి నెల్లూరు ప్రాంతాలలో పర్యటించడం కూడా పార్లమెంటు ఉపఎన్నిక వ్యూహంలో భాగమే అని అర్థమైపోతుంది. కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న తిరుపతిలో జనసేన ప్రభావం తమకు అనుకూలంగా ఉంటుందని కమలదళం ఆశ.

అందరికంటే ముందుగా అభ్యర్థిని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడిప్పుడే నిదానంగా పావులు కదుపుతుంటే, ఇప్పటివరకు అభ్యర్థిని నిర్ణయించని భారతీయ జనతా పార్టీ మాత్రం ప్రచార వ్యూహంలో జోరుగా ఉంది. ఇక అభ్యర్థిని నిర్ణయించి కూడా ప్రకటించని వైసిపి మాత్రం మెజారిటీ ఎంతన్నది లెక్కలేసుకుంటోంది. ఓటరు మాత్రం గుంభనంగా ఉన్నాడు.

### వందేళ్ళ తర్వాత.. తొలిసారిగా...

# మన రాష్ట్రంలోనే భూ సర్వే



## - సిఎం జగన్ చొరవతో చకచకా ఏర్పాట్లు

దాదాపు వందేళ్ళ తర్వాత తొలిసారిగా మన రాష్ట్రంలోనే సమగ్రమైన రీతిలో భూసర్వే ప్రారంభం అవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో అధికారులంతా ఈ కార్యక్రమం ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఈ సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోని వ్యవసాయ భూమి, ప్రభుత్వభూమి, గ్రామకంఠం భూములతో పాటు ప్రతి భూమిని సర్వే చేస్తారు. అన్ని వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తారు. యూనిక్ ఐడెంటిటీ నెంబర్‌తో కార్డు కూడా అందిస్తారు. ప్రతి రికార్డును డిజిటలైజ్ చేస్తారు. వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-సంరక్షణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన ప్రారంభం కానుంది. జిల్లాలోనూ అందుకు తగ్గ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సారధ్యంలో చేస్తున్నారు. తొలి దశలో జిల్లాలోని నాలుగు వందల గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్, రెవెన్యూ సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ఎంతోకాలంగా పరిష్కారానికి నోచుకోని భూముల సమస్యలు కూడా ఒక కొలిక్కి రానున్నాయి. ఈ పథకం ప్రారంభం కానుండడంతో భూముల సొంతదారుల్లో, రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి.

# 29కి తగ్గిన కరోనా కేసులు

జిల్లాలో కరోనా కేసులు 29కి తగ్గాయి. ఈనెల 9న 3581 మందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తే కేవలం 29 మందికే పాజిటివ్ వచ్చింది. గతంలో వందల సంఖ్యలో ఉన్న కేసులు గత కొద్దిరోజులుగా తగ్గుతుండడంతో అందరిలో ఆనందం వ్యక్తమవుతోంది. వైద్యుల నిరంతర పర్యవేక్షణ, సత్వర చికిత్సలతో కరోనా నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య కూడా బాగా పెరుగుతోంది.

ఇప్పటిదాకా మొత్తం 63,265 మందికి కరోనా పాజిటివ్ వస్తే వారిలో 62,626 మంది వైద్యచికిత్సలతో కోలుకుని తిరిగి ఇళ్ళకు వెళ్ళారు. ఈ వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారం నాటికి 579కి చేరింది. కరోనా వ్యాధిగ్రస్తులకు నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రి, నారాయణ ఆసుపత్రి, కోవిడ్ కేర్ సెంటర్లలో వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. క్రమేణా ఈ వ్యాధి తగ్గుముఖం పడుతున్నప్పటికీ ప్రజలు మాత్రం అప్రమత్తంగానే ఉండాలని, పూర్తిస్థాయిలో ఇది కట్టడి అయ్యేదాకా ప్రభుత్వం పేర్కొన్న నియమనిబంధనలు పాటిస్తుండాలని అధికారులు పదేపదే చెప్తూనే ఉన్నారు. ముఖ్యంగా మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, తరచూ సబ్బుతో చేతులు శుభ్రపరచుకుంటూ ఉండడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తుండడం వంటి నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని, కరోనా కట్టడి మన చేతుల్లోనే ఉందని సూచిస్తున్నారు.

## 15 వరకు ఓటర్ల నమోదు

ఓటర్ల నమోదుకు ఈ నెల 15వ తేది వరకు అవకాశం ఉందని, జనవరి 1, 2021 నాటికి 18 ఏళ్ళు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు కావచ్చని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 16న ప్రారంభమైన ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ ఈనెల 15 వరకు కొనసాగుతుందని, ఇందులో భాగంగా బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటర్ల నమోదు చేర్పులు మార్పులు తదితరాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్నవారు ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదై ఉన్నదీ లేనిదీ పరిశీలించుకోవచ్చని, కొత్తగా ఓటర్లుగా నమోదు కావాలనుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, లేదా పూర్తిచేసిన దరఖాస్తులను ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్‌ఓ), అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేయాలని వివరించారు.

### జిల్లాలో 24,36,035 మంది ఓటర్లు

జిల్లాలో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 24,36,035గా ఉందని, అందులో పురుషులు 11,92,916 కాగా స్త్రీలు 12,41,747 మంది, ఇతరులు 372 మంది ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

## కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా సుమతి

నెల్లూరు, బివినగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా ఈనెల7న సుమతి బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న లలితా శివజ్యోతిని కావలి వ్యవసాయ పరిశోధనా స్థానానికి అధికారులు బదిలీ చేశారు.

## అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

అణగారిన వర్గాల ప్రజలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ సుదర్శన్‌రావు కొనియాడారు. ఈనెల 6న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ 64వ వర్ధంతిని పురస్కరించుకుని వివిఎస్‌యులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న దివ్యాంగుల ఐక్యసంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వృద్ధులకు కూరగాయాలు, దుప్పట్లు పంపిణీచేశారు. నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ఓ స్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్లాక్‌బోర్డ్ మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, దివ్యాంగుల ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జ్ఞానేంద్రసరస్వతి అంధుల సేవాసంస్థ అధ్యక్షుడు రవికుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు హుస్సేన్, బాలాజీ, ధనుంజయ, రమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### బాధితులకు ఆహారపొట్లాలు

వర్షాల కారణంగా పనులు కోల్పోయి ఇబ్బందిపడుతున్న పేదలకు నెల్లూరులోని అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల6న ఆహారపొట్లాలను పంపిణీ చేశారు. నగరంలోని చిన్నబాలయ్యనగర్, మినీ బైపాస్ రోడ్డు, రంగనాయకులపేట తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రమేష్‌బాబు, శరత్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం

-మంజీర

### కరోనా మాస్కు

# ఇది భవిష్యత్తు జ్ఞాపకం

**2020** ఒక మ్యాజిక్ నంబర్. ఏపీ మాజీ సీఎం అయితే రెండు వేలు సంవత్సరానికి ముందు నుంచే ఈ ఏడాది కోసం కలలు కన్నారు. పాపం ఆ నాయకుడు ఈ ఏడాది జూమ్‌లో ప్రపంచాన్ని చూడాల్సివచ్చింది. ఇదంతా కోవిడ్-19 ప్రభావం. కోవిడ్ 19... ప్రపంచాన్ని మాత్రమే కాదు కాలాన్ని కూడా కుదిపేసింది. 2020 భయం భయంగా రోజులు వెళ్లదీస్తోంది. ఈ తరం భవిష్యత్తు జ్ఞాపకాల్లో ఎప్పటికీ మర్చిపోలేని ఏడాదిగా మిగులుతుందీ ఏడాది. ఈ ఏడాది గుర్తుకు రాగానే మాస్కు కూడా గుర్తు వచ్చి తీరుతుంది. బయట కాలు పెట్టాలంటే... మట్టి తినకుండా బుజ్జి దూడకు చిక్కం వేసినట్లు కరోనా వైరస్‌ను పీల్చకుండా మనిషి మూతికి మాస్కు కట్టించిన ఏడాది ఇది. మనిషిని ఇల్లు కదలకుండా కూర్చోబెట్ట గలిగింది కానీ, మనిషిలోని క్రియేటివిటీకి అడ్డుకట్టవేయలేకపోయింది కరోనా.

## ట్వంటీ ఫస్ట్ సెంచరీ కిడ్

ఈ మధ్య ఒక వీడియోను నెటిజన్‌లు చాలా ముచ్చటగా చూశారు. ఓ నాలుగేళ్ల బుజ్జిగాడు మాస్కుకు చిన్న రంధ్రం చేసి, లాలీపాప్ నోట్లో పెట్టుకున్నాడు. మాస్కు లోపలివైపు నుంచి లాలీపాప్ స్టిక్‌ని బయటకు దూర్చాడు. లాలీపాప్ బుజ్జిగాడి నోట్లో, స్టిక్ మాత్రం మాస్క్ బయట. ట్వంటీ ఫస్ట్ సెంచరీ కిడ్ అంటే వీడే అనిపించాడు. మరికొంత ముందుకెళ్తే... మధురైలోని కెఎల్ కుమార్ జూలైలో తన రెస్టారెంట్‌లో మాస్కు ఆకారంలో పరోటా చేశాడు. మొదటగా సర్జికల్ మాస్కులే రాజ్యమేలాయి. కానీ అవి జలుబు లేని వాళ్లకు కూడా తుమ్ములు తెచ్చేవి. నలుగురిలో తుమ్మాలంటే భయం, ఆపుకోలేక తుమ్మితే ఆరడుగులు కాదు కదా పదడుగుల దూరాన ఉన్నవాళ్లు కూడా ఆ తుమ్మినవాళ్లను ఉగ్రవాదిని చూసినట్లు చూసేవాళ్లు. కరోనా కష్టాలకంటే మాస్కు కష్టాలు ఎక్కువవుతున్న రోజుల్లో వచ్చింది ఒక విప్లవం. సృజనాత్మకమైన విప్లవం అది.

## బ్రైడల్ మాస్కు



పూనాలో శంకర్ కురాడే బంగారు మాస్కు చేయించుకుని వార్తల్లోకెక్కాడు. ఆ మాస్కు ధర రెండు లక్షల తొంభై వేల రూపాయలు. బంగారానికే ఇంత బిల్డప్పా, మమ్మల్ని చూడండి అంటూ సూరత్ వజ్రాల వ్యాపారులు డైమండ్ మాస్కులతో పంచ్ ఇచ్చారు. ఇందులో రొటీన్ డిజైన్‌లతోపాటు కస్టమైజ్డ్ మాస్కులు కూడా. మన పేరులో అక్షరాల ఆకారంలో డైమండ్స్‌ని పొదిగి ఇస్తారు. జపాన్ వాళ్లు మాత్రం సముద్రం మాది, ఆల్చిప్పలు మావి, ఆల్చిప్పల్లో పుట్టే ముత్యాలు మావి. 'మా తడాఖా చూడండి' అంటూ అకోయా ముత్యాలతో మాస్కు తయారు చేశారు. 0.7 క్యారట్ డైమండ్, 300 స్వరోస్కి క్రిస్టల్స్, 330 జపాన్ అకోయా ముత్యాలు... ఇన్ని ఉన్న తర్వాత ధర మామూలుగా ఉంటుందా! తొమ్మిది వేల మూడు వందల యాభై యూఎస్ డాలర్లు పలికింది. ఇంత మంది ఇన్ని చేస్తుంటే... నేను మాత్రం ఊరుకుంటే ఎలాగా అనుకున్నట్లుంది నైజీరియాలోని ఫ్యాషన్ డిజైనర్ సేఫియా డిజోమా. హెవీ ఎంబ్రాయిడరీ ఎంబోజింగ్ బీడ్ వర్కుతో తన డిజైనర్ వేర్ దుస్తులకు మ్యాచింగ్ మాస్కును తయారు చేసుకుంది. 'మేము మాత్రం వెనుకపడ్డామనుకుంటున్నారా' అని జైపూర్ డ్రెస్ డిజైనర్‌లు 'డిజైనర్ బ్రైడల్ మాస్కు'తో ఫ్రంట్‌కోర్‌లో నిలిచారు. వధువు దుస్తులకు, ఆభరణాలకు మ్యాచింగ్ మాస్కులవి. వధువు ఆభరణాలు కూడా దుస్తులకు మ్యాచ్ అవుతుంటాయి. ఈ రెండింటినీ కలుపుతూ మాస్కు మీద చక్కటి ఎంబ్రాయిడరీ చేసి అందులో ముత్యాలు, పచ్చలు అమర్చారు. వరుడికి కూడా ఇదే ఫార్ములా. ఇవన్నీ స్పెషల్ అకేషన్స్‌లో ధరించే మాస్కులు. ఇక రోజువారీ మాస్కులు కూడా చాలా హొయలు పోతున్నాయి.

## సరదాకి మాస్కు

అమ్మాయిలైతే మీసాల మాస్కు మీద మహా సరదా పడుతున్నారు. అలాంటి ఇలాంటి మీసాలు కాదు. క్షత్రియపుత్రుడులో కమల్‌హాసన్‌కి ఉన్నట్లు పెద్దరికం, పౌరుషం, రాజసానికి ప్రతీకగా మెలితిప్పిన మీసాలు. మరికొంతమంది అమ్మాయిలు ఎదుటి వారిని భయపెట్టాలనే సరదా కోసం భీకరంగా నవ్వుతున్న రక్తపిపాసి బొమ్మ మాస్కులు ధరిస్తున్నారు. మహిళలైతే కలంకారీ, ఇకత్ మాస్కులను ఓ డజన్ కొనేస్తున్నారు. మాస్కు రంగుల ఎంపికలో తమ వార్డ్‌రోబ్‌ను గుర్తు చేసుకుంటున్నారు. మగవాళ్లకు పెద్దగా పట్టింపు ఉండదు. ఎన్95 మాస్కులుంటే చాలు బతుకు భద్రం అనుకుంటారు. కానీ ట్రెండ్‌తోపాటే టైలర్లు కూడా.. షర్టు కుట్టే అదే క్లాత్‌తో ఒక మాస్కు కుట్టిస్తున్నారు. మగవాళ్లకు షర్టుతో కాంబినేషన్ మాస్కుల ఆలోచనను మొదట్లో పెద్ద కంపెనీలే మొదలుపెట్టాయి. వ్యాపారికి మించిన ముందుచూపున్న వాళ్లు ప్రపంచంలో ఉండరేమో!

## టెక్ మాస్కులు

మాస్కు మీదకు వజ్రాలు, వైఢూర్యాలు అలవోకగా ఒదిగిపోయినప్పుడు టెక్నాలజీ మాత్రం ఇమడకపోతుందా? తమ ముఖాన్ని ఫొటో తీసుకుని, మాస్కు కవర్ చేసే ప్రదేశాలను మాత్రమే మాస్కు మీద డిజిటల్ ప్రింట్ వేయించుకోవడమూ జరిగిపోయింది. ఆలోచనలు ఇక్కడితో... అంటే ఫ్యాషనబుల్‌గా కనిపించే ప్రయత్నాల దగ్గరే ఆగిపోలేదు. సామాజిక బాధ్యతతో కూడిన ట్రాన్స్‌పరెంట్ మాస్కులు కూడా తయారయ్యాయి. వినికిడి లోపం ఉన్న వాళ్లు ఎదుటి వాళ్ల మాటలను పెదవుల కదలికల ఆధారంగా అర్థం చేసుకుంటారు. ఇప్పుడు మాస్కు కారణంగా బధిరులకు ఎదురైన సమస్యకు చక్కటి పరిష్కారంగా మారాయి పారదర్శకమైన మాస్కులు. ప్రపంచ మాస్కు ధారణ ఇలా ఉంటే... మాస్కుకు ముక్కు దగ్గర రంధ్రం పెడుతున్న కోణంగులకూ కొదవలేదు. కరోనా నుంచి రక్షణ కోసం ముక్కును, మూతిని మాస్కుతో కవర్ చేయమని వైద్యరంగం వేనోళ్ల మొర పెట్టుకుంటూ ఉంటే... యూఎస్‌లో కొందరు ఇలా వ్యూహాత్మకంగా మోసం చేస్తున్నారు.

## మాస్కు ఆందోళన

కరోనా కాలాన్ని స్తంభింపచేసింది. మనుషుల్ని స్తబ్దుగా మార్చేసింది... అనుకుంటున్నాం. కానీ అంతే వేగంగా కొత్తదనానికి దారులు వేసింది. ఈ రంగం ఆ రంగం అనే తేడా లేకుండా అన్నింటిలోనూ క్రియేటివిటీని కొత్తపుంతలు తొక్కించింది. పెళ్లి వేడుకలో వధూవరులకే కాకుండా పెళ్లికి వచ్చిన వాళ్లందరూ మాస్కు ధరించాల్సిందే. కాబట్టి 'మగ పెళ్లి వారము... ఆడ పెళ్లి వారము' అని ముద్రించిన మాస్కుల్ని పెళ్లి మండపంలో పంచుతున్నారు. ఏ అవకాశాన్నీ వదులుకోని రాజకీయ నాయకులు కూడా కరోనా సమయంలో మాస్కుల మీద తమ ముఖాలను ముద్రించి జనానికి పంచారు. ఎన్నికల్లో పార్టీ గుర్తున్న మాస్కులు రాజ్యమేలాయి. కనిమొళి అయితే ప్రభుత్వం మీద నిరసన ప్రదర్శనను మాస్కు మీద నినాదాలను ముద్రించింది. నల్లటి మాస్కు మీద తెల్లటి అక్షరాలలో 'సేవ్ ఉమెన్, ఉమెన్ నీడ్ సేఫ్టీ', 'సేవ్ అవర్ డాటర్' అనే నినాదాలతో మహిళలు ఆందోళనలో పాల్గొన్నారు. ఇది కనిమొళి మార్కు నిరసన.

కమల్‌హాసన్ అప్పుడెప్పుడో ఆకలి రాజ్యం సినిమాలోనే అన్నాడు... 'స్వతంత్రదేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్' అని. నిజమే... స్వతంత్రదేశంలో కరోనా కాలం కూడా క్రియేటివ్‌గానే గడుస్తోంది.



# ముక్కోటి ఏర్పాట్లు పటిష్టంగా చేయండి

**మంత్రి అనిల్**

ఈ నెల 25న రానున్న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ డిసెంబర్ 10వ తేదీ గురువారం రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు పోలీసు శాఖతో సమీక్ష జరిపారు. ముక్కోటి పర్వదినం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశాలున్నందున కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా చూడాలని ఆదేశించాడు. మాస్కు ఖచ్చితంగా ధరించేలా భక్తులకు అవగాహన కల్పించాలని, అలాగే 24వ తేదీ రాత్రి నుండి 25వ తేదీ రాత్రి వరకు పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరాడు. అధికసంఖ్యలో మహిళలు వస్తారు కాబట్టి, మహిళా పోలీసులను ఎక్కువుగా నియమించాలని ఆదేశించాడు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశాడు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!




పెదపుత్తేడు వాస్తవ్యుడు, ప్రస్తుతం హైదరాబాద్ నివాసి మెట్టు అమర్‌నాథ్‌రెడ్డి - రమాదేవిల కుమారుడు (లేట్ మెట్టు సుబ్బారెడ్డి - పద్మావతమ్మల మనుమడు) **అనూప్‌రెడ్డి - అఖిల** (సిద్ధన రామ్‌ప్రసాద్‌రెడ్డి - సుప్రజల కుమార్తె)ల పరిణయం నవంబర్ 25వ తేదీ తిరుమలలో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనెలు.




నెల్లూరుజిల్లా, గూడూరు మండలం, నెల్లటూరు గ్రామ వాస్తవ్యులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి - భారతిల కుమారుడు (నెలబల్లి కృష్ణారెడ్డి - సరోజనమ్మల మనుమడు) **ప్రణీత్‌కుమార్‌రెడ్డి - కామాక్షి** (నెల్లూరుజిల్లా కాగులపాడు వాస్తవ్యులు చిల్లకూరు వీరారెడ్డి - పద్మజల కుమార్తె)ల వివాహం డిసెంబర్ 10వ తేదీ గూడూరులో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.







# స్పందించిన సహృదయం

- కుటుంబసభ్యులు, నెల్లూరీయుల సహకారంతో బాధితురాలికి సహాయం



### మానవత్వం చాటుకున్న..
## మన వెంకయ్య



***ఉపరాష్ట్రపతి హోదాలో తాను ఢిల్లీలో ఉన్నా తన మనసంతా నెల్లూరు పైన, నెల్లూరీయుల సంక్షేమంపైనే ఉంటుందని మరోసారి ఋజువు చేసుకున్నాడు 'మన వెంకయ్య'.***

తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యశ్రీ అనే బాధితురాలికి అవసరమైన వైద్యం కోసం ఆర్థికసాయం అందేలా చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచాడు. ఆమె వైద్యచికిత్సల కోసం ప్రధానమంత్రి సహాయనిధి నుంచి, ఉపరాష్ట్రపతి కార్యాలయం నుంచి, తన కుటుంబసభ్యులు, మిత్రుల నుంచి కూడా సాయం అందేలా చేసి ఆయన అందరి ఆత్మీయమైన అభినందనలు అందుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన దివ్యశ్రీ ఎంసిఏ పూర్తిచేసింది. ఆమె తండ్రి చెంచుకుమార్ సూళ్ళూరుపేట ఆర్టీసి డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో దివ్యశ్రీ ఫాంకొని అనీమియా అనే వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతోంది. వెల్లూరులోని సిఎంసి ఆసుపత్రి వైద్యులను సంప్రదిస్తే, ఆమెకు బోన్‌మ్యారో మార్పిడి చికిత్స చేయాలని, అందుకు పాతిక లక్షలు అవుతుందని చెప్పడంతో అంత ఆర్థిక స్తోమతు లేని ఆ తండ్రి తమ బిడ్డకు సాయం అందించి ఆదుకోవాలని కోరుకుంటూ ఉపరాష్ట్రపతికి లేఖ రాశారు. అందుకు స్పందించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆమె తండ్రితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పడమే కాక దివ్యశ్రీకి వైద్యచికిత్సల కోసం ప్రధానమంత్రి సహాయనిధి నుంచి 3 లక్షల రూపాయలు విడుదల చేయించారు. తన సతీమణి శ్రీమతి ఉష ద్వారా లక్ష రూపాయలు, ఉపరాష్ట్రపతి కార్యాలయం నుంచి నిబంధనల మేరకు 75 వేల రూపాయలు, స్వర్ణభారత్ ట్రస్టు నుంచి లక్ష రూపాయలు, తమ కుమారుడు హర్షవర్ధన్ ద్వారా లక్ష రూపాయలు, కుమార్తె దీపావెంకట్ ద్వారా మరో లక్షరూపాయలు సహాయం అందేలా కూడా ఉపరాష్ట్రపతి చొరవ తీసుకున్నారు.

అంతేకాకుండా నెల్లూరీయులైన బి.సుబ్బారెడ్డి (వంశీరామ్ బిల్డర్స్) ద్వారా 5 లక్షల రూపాయలు, శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ద్వారా 2లక్షలా 25వేల రూపాయలు, సి.వెంకటేశ్వరరెడ్డి(అపర్ణ కన్‌స్ట్రక్షన్స్) ద్వారా 2 లక్షల రూపాయలు, సి.సుబ్బారెడ్డి (సీబ్రోస్ కన్‌స్ట్రక్షన్స్) ద్వారా లక్ష రూపాయలు తదితరుల సహకారంతో 10.25 లక్షల రూపాయలను సాయంగా అందేలా ఏర్పాటుచేశారు. మొత్తంగా దీంతో దివ్యశ్రీ వైద్యానికి 18 లక్షల రూపాయలు సమకూరాయి. ఇంకా అవసరమైన సాయం కోసం స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్, వెల్లూరులోని ఐఐటి విద్యా సంస్థలు, శ్రీపురం లక్ష్మీనారాయణి స్వర్ణ మందిరం వారితో మాట్లాడి దివ్యశ్రీ వైద్యానికి సహకారం అందించాలని కోరడం వెంకయ్యానాయుడి మానవతా హృదయానికి నిదర్శనం.

తమ బిడ్డ అనారోగ్యం గురించి లేఖ రాసిన వెంటనే ఇంతగా స్పందించి వైద్య చికిత్స కోసం చొరవ తీసుకుని సాయం అందించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు దివ్యశ్రీ కుటుంబసభ్యులు మనసారా కృతజ్ఞతలు చెప్తున్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
**అమ్మ ఫర్నిచర్ మాల్**
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com